



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 235 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | ఆదివారం 17 మే 2026 | పేజీలు : 12 | వెల : 2/-




## టిప్పర్ రూపంలో కబళించిన మృత్యువు

- ఆరుగురు ఉపాధి కూలీల మృతి
- ఘటనా స్థలంలో నలుగురు.. ఆసుపత్రిలో మరో ఇద్దరు...
- తెల్లవారు జామునే చితికిన కూలీల బతుకులు
- కాకినాడ రూరల్ కొవ్వూరు బైపాస్ రోడ్డులో ఘటన
- అంత్యక్రియలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల సహాయం
- అన్ని విధాల ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా
- ఘటన స్థలానిక రూరల్ ఎమ్మెల్యే తనయుడు పంతం సందీప్, కూటమి నాయకులు

కాకినాడ రూరల్ క్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :
కాకినాడ రూరల్ కొవ్వూరు బైపాస్ రోడ్లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు ఉపాధి మహిళా కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు మహిళ కూలీలకు తీవ్ర గాయాలు అయ్యాయి. శనివారం తెల్లవారు జాము ప్రాంతంలో అత్యంత వేగంతో టిప్పర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. అలాగే ఆ సమయంలో టిప్పర్ డ్రైవర్ మందు తీసుకున్నాడని తెలియజేశారు. కూలీలకు హాజరుకు ఉపయోగించే మిగతా .. 2లో..

పవన్ పార్టీ పెట్టింది సీఎం అవ్వడానికి కాదు..

## ఆ విషయం మాకు ఎప్పుడో తెలుసు

**అంబటి రాంబాబు**



**విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై వైసీపీ నేత అంబటి రాంబాబు ఘాటు విమర్శలు చేశారు. పవన్ తన పార్టీని సీఎం అవ్వడానికి పెట్టలేదని, మరొకరిని సీఎం చేయ డానికి పెట్టారని తమకు ఎప్పట నుంచో తెలుసంటూ ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా అంబటి ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళ నటుడు విజయ్ ఇటీవల రాజకీ యాల్లోకి వచ్చి ఒంటరిగా పోటీ చేసి గెలిచిన నేపథ్యంలో, పవన్ కూడా అలాగే మిగతా .. 2లో..

నా జీవితాశయం ఇదే.. ఈ నాలుగు కార్యక్రమాలే

# నా ప్రాధాన్యం..



- పరిశుభ్రత, పేదరిక నిర్మూలన, జనాభా పెరుగుదల, భూ రికార్డుల ప్రక్షాళనే తన ప్రాధాన్యతలని స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన చంద్రబాబు
- ఉత్తరాంధ్ర నుంచి వలసలు పోవద్దు, ఉత్తరాంధ్రకే వలసలు రావాలన్నదే తన సంకల్పమని వెల్లడి
- గత ప్రభుత్వ పాలనను 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ, విధ్వంసానికి, అభివృద్ధికి ఉన్న తేడాను గమనించాలని ప్రజలకు పిలుపు
- నరసన్నపేట నియోజకవర్గానికి పలు అభివృద్ధి పనులను మంజూరు చేస్తూ వేదికపై నుంచే హామీ

**విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రభుత్వ దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. తన మనసుకు దగ్గరైన నాలుగు కార్యక్రమాలే రాష్ట్ర భవిష్యత్తుకు మూలస్తంభాలని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చే 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర', పేదలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలు, జనాభా సమతుల్యత, భూ రికార్డుల ప్రక్షాళన తన జీవితాశయమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించి, రాష్ట్రాన్ని చెత్త రహితంగా మార్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. **నా జీవితాశయం ఇదే.. నాలుగు కార్యక్రమాలే నా ప్రాధాన్యం** ప్రజల అభిమానాన్ని చూస్తుంటే మిగతా .. 2లో..



అప్పుడు నాలుగే యూనికార్న్‌లు..

## ఇప్పుడు 100కు పైగా..

**ప్రధాని నరేంద్ర మోదీ**

**విశ్వం వాయిస్ న్యూస్ :** సెమీకండక్టర్ల విషయంలో భారత్ కీలక ముందడుగు వేసిం దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ఆయన హేగ్ నగరంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా సాం స్కృతిక కార్యక్రమాలతో ప్రధానికి ఘనస్వాగతం లభించింది. ప్రవాస భారతీయులతో కరచాలనం, మాటామంతీ నిర్వహించారు. నెదర్లాండ్స్ నాయ కత్వంతో ఎప్పుడు మాట్లాడినా ప్రవాస భారతీయు లను ఎంతో ప్రశంసించేవారని ప్రధాని గుర్తు చేసుకున్నారు. హేగ్ మిగతా .. 2లో..

ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే

## తొలగించాలి

**రాహుల్ గాంధీ డిమాండ్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్-యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. పేపర్ లీకేజీ వల్ల దాదాపు 22 లక్షల మంది కి పైగా విద్యార్థులు పడిన కష్టం, వారి కలలు ఛిన్నాభిన్న మయ్యాయన్నారు. ఇందుకుగాను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రధా నిగా మోదీ బాధ్యత తీసుకోవాలన్నారు. దేశంలో ఇంత జరుగుతున్నా.. ఈ విషయంపై మిగతా .. 2లో..


మూడో బిడ్డను కంటే రూ.30 వేలు, నాలుగో బిడ్డకు రూ.40 వేలు...

## చంద్రబాబు బంపర్ ఆఫర్

వార్త 2లో..

## భగీరథ్‌ను పోలీసులకు అప్పగించాం

**కేంద్ర మంత్రి బండి సంజయ్**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** చట్టంపై గౌరవంతో తన కుమారుడు భగీరథ్‌ను పోలీసులకు అప్పగించినట్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న భగీరథ్‌ను లాయర్ల ద్వారా పోలీసుల విచారణ కోసం అప్పగించామని తెలిపారు. మరోవైపు, అతడు దేశం దాటి వెళ్లిపోకుండా లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు.. ఐదు బృందాలతో గాలిస్తున్న నేపథ్యంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. "చట్టం ముందు నా బిడ్డ అయినా, సామాన్యుడైనా సమానమే.. అందరం చట్టానికి లోబడి ఉండాల్సిందే. తాను ఏ తప్పు చేయలేదని మా అబ్బాయి పదే పదే చెబుతున్నాడు. వాస్తవానికి ఫిర్యాదు రాగానే పీఎస్‌లో అప్పగిద్దామని అనుకున్నా. లాయర్లను సంప్రదించి తన వద్ద ఉన్న ఆధారాలను పోలీసుల ముందు ఉంచాడు. ఆధారాలను చూసి కేసు కొట్టేస్తారని, బెయిల్ తప్పకుండా వస్తుందని లాయర్లు చెప్పారు. ఇవాళే బెయిల్ వస్తుందని లాయర్లు చెబుతున్నారు. ఇంకా జాప్యం చేయడం సరికాదనే ఉద్దేశంతో మా అబ్బాయిని లాయర్ల ద్వారా పోలీసుల మిగతా .. 2లో..

రాష్ట్రంలో 'ఏపీ సైబర్ గార్డ్' పేరుతో

## కొత్త వ్యవస్థ ఏర్పాటు

- 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ
- ఫిర్యాదు చేసిన 30 నిమిషాల్లోనే చర్యలు
- తొలిదశలో 500 మందికి ప్రత్యేక శిక్షణ



**విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ నడుం బిగించింది. 'ఏపీ సైబర్ గార్డ్' పేరుతో కొత్త విభాగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రకటించారు. సైబర్ ఆర్థిక మిగతా .. 2లో..

## నా వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేశారు

**ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు**




**విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటీకరణ చేస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని, వాటిని నమ్మవద్దని సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు స్పష్టం చేశారు. ఈ ప్రచారంపై ఆయన శనివారం మచిలీపట్నంలో వివరణ ఇచ్చారు. తన మాటలను పూర్తిగా వినకుండా కొందరు వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ మిగతా .. 2లో..

## వారి స్వాతంత్ర్యం కోసం మేం పోరాడబోం

**తైవాన్ అంశంలో మాటమార్చిన ట్రంప్**

**విశ్వం వాయిస్ న్యూస్ :** తైవాన్ అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. అది తమకు కష్టమైన సమస్యేనని వెల్లడించారు. భౌగోళికంగా ఆ ప్రాంతం తమకు చాలా దూరంలో ఉందని వ్యాఖ్యానించారు. "తైవాన్ అంశం క్లిష్టమైన సమస్యే. ఈ ద్వీపం.. చైనాకు కేవలం 95 కిలోమీటర్ల దూరంలో ఉండగా, అమెరికాకు మాత్రం 15 వేల కి.మీ.కు పైగా దూరాన ఉంది. ఎక్కువ దూరం మిగతా .. 2లో..



(మొదటిపేజీ తరువాయి)

# టిప్పర్ రూపంలో కబళించిన మృత్యువు

ఫేస్ యాప్కు నెట్ అందకపోవడంతో పనులు చేసుకుంటున్న వారిని ఫీల్డ్ అసిస్టెంట్ నమోదు కోసం రోడ్డు పక్కకు పిలిచినట్లుగా వారు చెప్పారు. 20 మంది పూర్తయిన తర్వాత వారు వెళ్లిపోగా మిగిలిన ఆరుగురికి యాప్ స్కాన్ చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు అక్కడి స్థానికులు చెప్పారు. ఈ ప్రమాదంలో చీడిగ ప్రాంతానికి చెందిన వాసంశెట్టి సత్యవతి, పాలిక కృష్ణవేణి, కాదా చిట్టెమ్మ, చెల్లూరి అన్నవరంలు మృతిచెందగా పాలిక నాగమణి, మట్టపర్తి అరుణ కుమారిలకు గాయాలయ్యాయి. ఉదయమే ఈ ప్రమాదం జరగడంతో ఈ వార్త దావానంలో చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించింది. గత మూడు నెలల కాలంలో కేవలం హైవే ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోయిన అనేక కుటుంబాలు వీధిన పడ్డాయి. కాకినాడ చుట్టుపక్కల గ్రామాల కూడలి హైవేగా మారడం గ్రామాలకు ఆనుకుని ఉన్నాయి. ఈ హైవే అరకొరగా పూర్తయిన రవాణా సౌకర్యానికి వీలు లేకపోయినా భారీ వాహనాలు ఈ రహదారిపై రాకపోకలు నిర్వహించడం వల్ల అవగాహన లోపం వల్ల అధికారుల నిర్లక్ష్యం వల్ల అనేక పేద కూలి పని చేసుకునే కుటుంబాలు రోడ్డును పడుతున్నాయి ప్రమాదాల బారినపడి రోడ్డును పడుతున్నాయి.. రోడ్డు భద్రత భవనాల శాఖ అధికారులు ఈ హైవేలపై పర్యవేక్షణ లోపం ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడం హైవేపై జీబ్రా క్రాసింగ్లు వంటివి ఏర్పాటు చేయకపోవడం వల్ల హైవే రహదారిపై భారీ ప్రమాదాలు జరుగుతున్నవి. జిల్లా పోలీసులు గ్రామాల అనుకుని ఉన్న హైవేలపై ఏర్పాటు చేసిన పెట్రోలింగ్ వాహనాలు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల ఎప్పటికప్పుడు నేత్రాలు పర్యవేక్షణ లోపం వల్ల రాత్రులు తెల్లవారులు రాత్రి సమయాలలో భారీ వాహనాలు అత్యంత వేగంతో ఈ రహదారులపై రాకపోకలు నిర్వహించడం తెల్లవారుజామున అదే వేగంతో రావడం వల్ల ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నావని స్థానికులు తెలుపుతున్నారు. హైవేలపై పోలీస్ హైవే పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో ఉండేలా జిల్లా పోలీసు వారు సహకరించాలని అనేకమంది కోరుతున్నారు. భారీ వాహనాలు అలాగే లారీలు టిప్పర్లు వంటి ఇసుక మట్టి గ్రావెల్ వంటివి రాత్రులు రవాణా చేస్తున్న వాహనాలపై రవాణా శాఖ అధికారులు పట్టించుకోకపోవడం రాత్రి సమయాలలో వాహనాలను తనిఖీలు చేయకపోవడం వల్ల కనీసం లైసెన్సు ఇన్సూరెన్స్ లేని వాహనాలు హైవేలపై అత్యంత వేగంతో తిరుగుతూ ప్రమాదాలు చేస్తున్నారని హైవే ని ఆనుకుని ఉన్న గ్రామస్తులు తెలుపుతున్నారు ఎప్పటికైనా రవాణా శాఖ వారు మేల్కొని రాత్రి సమయాలలో తిరిగే వాహనాలను తనిఖీలు చేసి సురక్షితంతో కూడిన వేగంతో రవాణా సౌకర్యాలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని రవాణాశాఖ అధికారులను కోరుతున్నారు. ప్రతి సంవత్సరం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రమాదాల శాతం తగ్గిందని పేపర్ పై చెప్పడమే తప్ప ప్రతినెల హైవేలపై అనేక ప్రమాదాల బారిన పడి అనేక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని దీనిపై పోలీసు వారు ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రమాదాలు నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని హైవేలకు ఆనుకుని అనుసంధానంగా ఉన్న గ్రామస్తులు జిల్లా ఎస్పీని కోరుతున్నారు. మృతులంతా పేదలు, వ్యవసాయ కార్మికులు కావడంతో వారి కుటుంబాలలో తీవ్ర విషాదం నెలకొంది.

### పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి

కాకినాడ జిల్లా రోడ్డు ప్రమాదంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నలుగురు మహిళా ఉపాధి కూలీలు బాధాకరమన్నారు. పని ప్రదేశంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం తీవ్రంగా కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు పరిహారం వెంటనే అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పని ప్రదేశంలో వేగ నియంత్రణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

### నారా లోకేష్ దిగ్భ్రాంతి

కాకినాడ రూరల్ పరిధిలోని కొవ్వూరు బ్రిడ్జి సమీపంలో ఈ ఉదయం ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం ఉదయాన్నే ఉపాధి పనులకు వెళుతూ నలుగురు మహిళా కార్మికులు ఇలా దుర్మరణం పాలవ్వడం తనను ఎంతగానో కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి, కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు కూలీలను కాకినాడ సర్వజనాస్పత్రికి తరలించగా, వారికి మెరుగైన అత్యవసర వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన కాకినాడ రూరల్ పోలీసులు పరారైన లారీ డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

**పవన్ పార్టీ పెట్టింది సీఎం అవ్వడనికి కాదు..**

# ఆ విషయం మాకు ఎప్పుడో తెలుసు

గెలవాల్సిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చపై జనసేనాని స్పందించారు. విజయ్‌తో తనకు పోలిక లేదని, గతంలో తాను ఒంటరిగా రెండు చోట్ల పోటీ చేస్తే ప్రజలు ఓడించారని గుర్తుచేశారు. అందుకే పొత్తులతో వెళ్లాల్సి వచ్చిందని ఆయన వివరించారు. పవన్ చేసిన ఈ వ్యాఖ్యలనే అంబటి రాంబాబు ఆయుధంగా చేసుకున్నారు. "మీరు సీఎం కావాలని కాదు, ఎవరో సీఎం కావాలని పార్టీ పెట్టారని మాకు ఎప్పుడో తెలుసు. కానీ ఆ విషయం ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది" అని అంబటి వ్యాఖ్యానించారు. పవన్ స్వయంగా తన ఓటమిని, పొత్తుల అవసరాన్ని అంగీకరించడంతో, ఆయన రాజకీయ లక్ష్యంపై అంబటి పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలతో ఏపీ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం మొదలైంది.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే తొలగించాలి

ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహించడంపై ఆశ్చర్యం వ్యక్తంచేశారు. భాజపా నేతలు, విశ్వవిద్యాలయ అధికారులు కుమ్మక్కయ్యి దేశ విద్యా వ్యవస్థను దెబ్బతీశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. యూనివర్సిటీల్లో వైస్ ఛాన్సలర్ల నియామకాలు యోగ్యత ఆధారంగా కాకుండా ఆర్ఎస్ఎస్ సైద్ధాంతిక అనుబంధం ఆధారంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో 80 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయని.. అవి రెండు కోట్ల మంది యువత భవిష్యత్తును నాశనం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిసారి పేపర్ లీక్ మాఫియా ఎటువంటి శిక్షల్లేకుండా తప్పించుకుంటుంటే.. నిజాయతీపరులైన విద్యార్థులు మాత్రం శిక్ష అనుభవిస్తున్నారని అన్నారు. పేపర్ లీక్ ఆరోపణలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# భగీరథ్‌ను పోలీసులకు అప్పగించాం

విచారణకు అప్పగించాను. న్యాయ వ్యవస్థపై నాకు సంపూర్ణమైన నమ్మకం ఉంది. వాస్తవానికి కోర్టు ఉత్తర్వులు సోమవారం వెలువడే అవకాశం ఉంది. న్యాయ వ్యవస్థపై నమ్మకంతో ఇంకా ఆలస్యం కావొద్దనే ఉద్దేశంతో విచారణకు పంపించాను" అని సంజయ్ పేర్కొన్నారు.

### భగీరథ్‌ని అరెస్టు చేశాం..: సీపీ రమేశ్ రెడ్డి

మరోవైపు, పోక్సో కేసులో బండి భగీరథ్‌ను అరెస్టు చేసినట్లు సైబరాబాద్ సీపీ రమేశ్‌రెడ్డి వెల్లడించారు. 'నార్సింగిలో పోలీసు అకాడమీ వద్ద పట్టుకున్నాం. పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించాం' అని తెలిపారు. అయితే, భగీరథ్‌ని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకురావడంతో ఈ కేసులో విచారణ అధికారిణిగా ఉన్న డీసీపీ రితిరాజ్ అతడిని విచారిస్తున్నట్లు సమాచారం. విచారణ అనంతరం నేరుగా మేడ్చల్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచనున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు పోలీసులు ఈ ఉదయం భగీరథ్ కోసం ఐదు బృందాలతో బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, కరీంనగర్‌లో గాలింపు చేపట్టారు. అనంతరం నాటకీయ పరిణామాల మధ్య భగీరథ్‌ని అరెస్టు చేశారు. తొలుత పోలీసుల ఎదుట లొంగిపోతాడని ప్రచారం జరిగినప్పటికీ.. పోలీసులే అతడిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు సమాచారం.

### కాసేపట్లో న్యాయమూర్తి ముందుకు..

పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులు విచారిస్తున్నారు. అతడి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తున్నారు. మరికొద్దిసేపట్లో న్యాయమూర్తి ఎదుట హాజరు పరచనున్నారు. ఇందు కోసం మేడ్చల్ మేజిస్ట్రేట్ సమయాన్ని పేట్‌బషీరాబాద్ పోలీసులు కోరారు. ఇదిలా ఉండగా.. భగీరథ్ అరెస్టు నేపథ్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. "భగీరథ్ అరెస్టు కాలేదు.. పోలీస్ విచారణ కోసం హాజరయ్యాడు. ఇద్దరు న్యాయవాదుల సమక్షంలో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు" అని పేర్కొంటూ ఓ ఫొటోను షేర్ చేయడం గమనార్హం. ఈ నెల 8న భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కాగా.. సీఎం ఆదేశాలతో ఈ కేసుపై డీజీపీ సీవీ ఆనంద్ సిట్ ఏర్పాటు చేశారు. ఈ కేసును కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి వాంగ్మూలం తర్వాత పోక్సో సెక్షన్లు మార్చారు. భగీరథ్‌పై ఈ ఉదయం పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

**రాష్ట్రంలో 'ఏపీ సైబర్ గార్డ్' పేరుతో**

# కొత్త వ్యవస్థ ఏర్పాటు

మోసాలకు గురైన బాధితులు వీలైనంత త్వరగా తమ డబ్బును తిరిగి పొందేలా చర్యలు చేపట్టడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశం. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ఎస్పీలు, కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సైబర్ మోసాల్లో డబ్బు పోగొట్టుకున్న బాధితులకు తొలి 30 నిమిషాలు అత్యంత కీలకమని, అందుకే 'గోల్డెన్ అవర్' విధానంపై దృష్టి సారించినట్లు డీజీపీ తెలిపారు. డీజీపీ మాట్లాడుతూ.. "1930 హెల్ప్ లైన్‌కు సైబర్ నేరాల బాధితులు ఫిర్యాదు చేశాక తొలి 30 నిమిషాలు అత్యంత కీలకం. ఈలోగా పోలీసులు స్పందిస్తే బాధితులు పోగొట్టుకున్న సొత్తు తిరిగి రాబట్టడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. అందుకే బ్యాంకుల్లో 30 నిమిషాల పాటు లియన్ మార్కింగ్ (నేరగాళ్ల ఖాతాల్లోకి సొమ్ము జమకాకుండా నిలుపుదల) తప్పనిసరి చేస్తున్నాం," అని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ పటిష్టమైన ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా ఆరు సూత్రాల వ్యూహాన్ని అమలు చేయనున్నారు. 24/7 సైబర్ వార్ రూమ్ ఏర్పాటు, ఏఐ ఆధారిత పర్యవేక్షణ, తొలి దశలో 500 మంది అధికారులకు శిక్షణ వంటివి ఇందులో ఉన్నాయి. రాష్ట్రంలో 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఇప్పటివరకు 9.29 లక్షల ఫిర్యాదులు రాగా, బాధితులు రూ.652 కోట్లు కోల్పోయినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ కొత్త చర్యలతో సైబర్ నేరగాళ్ల ఆటకట్టించి, ప్రజలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ముందుకు సాగుతోంది.

# నా వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేశారు

"దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యుత్తు బస్సుల ప్రైవేటీకరణ జరిగింది. నిర్వహణ కోసం ప్రైవేటు సంస్థలకు టెండర్లు పిలిచారు. ఆ సంస్థలే పెట్టుబడి, నిర్వహణ, డ్రైవర్లను చూసుకుంటాయి. ఆర్టీసీ కేవలం కండక్టర్లను మాత్రమే ఇస్తుంది. బస్సులకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్లు, సబ్ స్టేషన్ల నిర్మాణానికి కేంద్రమే నిధులు కేటాయిస్తోంది" అని వివరించారు. మచిలీపట్నం బస్టాండులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రయాణికులతో మాట్లాడానని కొనకళ్ల తెలిపారు. ఆ సమయంలో, విద్యుత్తు బస్సులను పూర్తిగా ఆర్టీసీనే నిర్వహించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారని విలేకరులు ప్రస్తావించగా, దానికి తాను ఇచ్చిన సమాధానాన్ని వక్రీకరించారని అన్నారు. కేవలం విద్యుత్తు బస్సుల నిర్వహణ గురించి తాను మాట్లాడితే, మొత్తం ఆర్టీసీనే ప్రైవేటీకరణ చేస్తున్నట్లు చిత్రీకరించడం సరికాదని ఆయన హితవు పలికారు.

# వారి స్వాతంత్య్రం కోసం మేం పోరాడబోం

కావడంతో మేం వేగంగా స్పందించడం కష్టమే. చైనా చాలా శక్తిమంతమైన, పెద్ద దేశం కూడా. ఉద్రిక్తతల విషయంలో చైనా, తైవాన్‌లు సంయమనం పాటించాలి" అని ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ట్రంప్ చెప్పారు. వారి స్వాతంత్ర్య ఆకాంక్షల కోసం అంతదూరం ప్రయాణించి మేం యుద్ధం చేయాలని అనుకోవడం లేదన్నారు. చైనా పర్యటన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తైవాన్ సమస్యను సరిగ్గా పరిష్కరించకపోతే.. అమెరికా-చైనా మధ్య ఘర్షణ తలెత్తే ప్రమాదం ఉందని ట్రంప్‌నకు జిన్‌పింగ్ స్పష్టం చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో అమెరికా- చైనాలు భాగస్వామ్య దేశాలుగా ఉండాలే తప్ప... ప్రత్యర్థులుగా కాదని జెన్‌పింగ్ పేర్కొనడం గమనార్హం. తైవాన్‌ను తనలో పూర్తిగా విలీనం చేసుకోవాలని చైనా కోరుకుంటోంది. తైవాన్ స్వాతంత్ర్యాన్ని అమెరికా బహిరంగంగా వ్యతిరేకించాలన్నది చైనా వాదన. 'తైవాన్ విషయంలో చైనా ఏకపక్ష చర్యలకు దిగరాదు' అని ఇంతకాలం అమెరికా స్పష్టంచేస్తూ వచ్చింది. దానికి భిన్నంగా ఇప్పుడు ట్రంప్ మాట్లాడుతున్నారు. తైవాన్‌కు ఆయుధాలు విక్రయించాలా, వద్దా అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పడమూ ఆయన వైఖరిలో మార్పును వెల్లడిస్తోంది.

# నా ప్రాధాన్యం..

ఎంత కష్టపడినా తక్కువేననిపిస్తోందని చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "నా మనసుకు దగ్గరైన నాలుగు కార్యక్రమాలు ఉన్నాయి. మొదటిది రాష్ట్రాన్ని పరిశు భ్రంగా ఉంచే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర. రెండోది నెల మొదటి తారీఖున పేదలకు పింఛన్లు అందించి వారి బాగోగులు తెలుసుకోవడం. మూడోది జనాభా నియంత్రణ పేరుతో గతంలో జరిగిన పొరపాటును సరిదిద్ది, పిల్లల్ని సంపదగా భావించడం. అందుకే మూడో బిడ్డకు రూ.30,000, నాలుగో బిడ్డకు రూ.40,000 అందిస్తున్నాం. నాలుగోది, గొడ్డలి పార్టీ నాశనం చేసిన భూ రికార్డులను బ్లాక్‌చైన్ టెక్నాలజీతో ప్రక్షాళన చేసి, 2027 మార్చి నాటికి భూతగాదాలు లేని రాష్ట్రంగా మార్చడం" అని తన లక్ష్యాలను వివరించారు.

### స్వచ్ఛాంధ్ర ఉద్యమం.. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ప్రారంభం

స్వచ్ఛాంధ్ర కార్యక్రమం 17వ సారి నిర్వహిస్తున్నామని, దీని ద్వారా రాష్ట్రంలో మార్పు కనిపిస్తోందని చంద్రబాబు అన్నారు. "స్వచ్ఛత అంటే రోడ్లు, ఇళ్లు శుభ్రంగా ఉండటమే కాదు, మన ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలి. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పేరుకుపోయిన 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్‌ను క్లియర్ చేయడానికి 23 నెలలు పట్టింది. జూన్ నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త లేకుండా చేసే బాధ్యత మాది" అని హామీ ఇచ్చారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లు, వ్యర్థాల సేకరణకు 'స్వచ్ఛ రథం', పాఠశాలల్లో 'నెట్ జీరో' విధానం వంటి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

### ఉత్తరాంధ్ర నుంచి వలసలు కాదు.. ఉత్తరాంధ్రకే వలసలు రావాలి

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. "ఒకప్పుడు దేశంలో ఏ నగరానికి వెళ్లినా శ్రీకాకుళం కాలనీ ఉండేది. ఈ పరిస్థితి మారాలి. ఉత్తరాంధ్ర నుంచి వలసలు పోవడం కాదు, ఉత్తరాంధ్రకే వలసలు రావాలి. ఇదే నా సంకల్పం" అని ఆయన స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్, మూలపేట పోర్ట్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలతో ఉత్తరాంధ్ర దశ, దిశ మారుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులైన మధ్యవలస స్టేజ్-2, హీరమండలం ఎత్తిపోతల, వంశధార, జంఝావతి ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని క్యాలెండర్ ప్రకటించారు. 60 ఏళ్ల కల అయిన నేరేడి బ్యారేజ్‌ను ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

### అవార్డుల అభినందనలు.. నరసన్నపేటకు వరాలు

జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా నిలిచి అవార్డులు సాధించిన అధికారులను, ప్రజాప్రతినిధులను చంద్రబాబు వేదికపై నుంచి అభినందించారు. దేశంలోనే 8 అవార్డులు సాధించి పంచాయతీరాజ్ శాఖ నంబర్ వన్‌గా నిలిచిందని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే రమణమూర్తి విజ్ఞప్తి మేరకు, నరసన్నపేటలోని రాజుల చెరువు ఆధునికీకరణ, ఓల్డ్ ఎన్హెచ్ రోడ్డు విస్తరణ, శ్రీముఖలింగం ఆలయ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించడం వంటి పలు అభివృద్ధి పనులకు అక్కడికక్కడే ఆమోదం తెలిపారు. ఎర్రన్నాయుడు పార్క్ కేసును పరిష్కరించే బాధ్యతను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించారు.

### లెక్కలతోనే నా పాలన.. అధికారులకు మార్కులు, క్లాసులు

తన ప్రసంగంలో భాగంగా ముఖ్యమంత్రి, శ్రీకాకుళం జిల్లా అధికారుల పనితీరుపై డేటాతో సహా సమీక్ష నిర్వహించారు. "50 ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్తి రాష్ట్ర సగటు 72.96% ఉండగా, శ్రీకాకుళం జిల్లాలో 75.2% ఉండటం అభినందనీయం" అని కలెక్టర్‌ను, అధికార యంత్రాంగాన్ని ప్రశంసించారు. రీ-సర్వే, తాగునీరు, బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ వంటి విభాగాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన వారిని అభినందిస్తూనే, ఆర్టీసీ బస్ సర్వీసులు, గంజాయి నియంత్రణ, సీఎం రిలీఫ్ ఫండ్ అమలులో వెనుకబడిన శాఖల అధికారులను హెచ్చరించారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### గొడ్డలి పార్టీతో జాగ్రత్త.. విధ్వంసం, అభివృద్ధికి తేడా ఇదే

గత ప్రభుత్వ పాలనను 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "అధికారం అంటే విధ్వంసం కాదు, ప్రజల జీవితాలను మార్చే అవకాశం. గత ఐదేళ్ల ప్రభుత్వ టెర్రరిజం, కబ్జాలు, అరాచకాలతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కుంటుపడింది. బాబాయ్‌ని గొడ్డలితో చంపి, ఆ నింద నాపై వేసి ఎన్నికల్లో గెలిచారు. అలాంటి వారి కొత్త నాటకాలతో మళ్లీ వస్తారు, జాగ్రత్తగా ఉండాలి" అని ప్రజలను హెచ్చరించారు. విధ్వంసానికి, అభివృద్ధికి మధ్య ఉన్న తేడాను గమనించి, రాష్ట్ర భవిష్యత్తు కోసం అభివృద్ధికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఇప్పుడు 100కు పైగా..

నగరం భారతీయ స్నేహానికి సజీవ చిహ్నంగా మారిందన్నారు. కాలం మారినా.. భారతీయ సంస్కృతి మారలేదని కొనియాడారు. ఈ సందర్భంగా ఈయూ దేశాలనుద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయి. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవి. ఇప్పుడు 100కిపైగా ఉన్నాయి. భారత్‌లో సెమీ కండక్టర్ ప్లాంట్ల పనులు జరుగుతున్నాయి. మేడిన్ ఇండియా చిప్‌లు తయారవుతున్నాయి. ఏఐ సమ్మిట్, జీ20 సమావేశాలను విజయవంతంగా నిర్వహించగలిగాం. భారత్‌లో 90 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో 64 కోట్ల మంది ఓటు వేశారు. ఈయూ దేశాల జనాభా మొత్తం కలిపినా 64 కోట్ల మంది కూడా లేరు" అని మోదీ తెలిపారు.

# మూడో బిడ్డను కంటే రూ.30 వేలు, నాలుగో బిడ్డకు రూ.40 వేలు... చంద్రబాబు బంపర్ ఆఫర్



**పిల్లలే సంపద' పేరుతో జనాభా పెరుగుదలకు ఏపీ సర్కార్ కొత్త పథకం**

**జనాభా తగ్గితే ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్న సీఎం చంద్రబాబు**

**పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీని ప్రకటించిన ప్రభుత్వం - శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో ముఖ్యమంత్రి ప్రకటన**

**విశ్వం వాయిస్ న్యూస్ :** జనాభా పెరుగుదలను ప్రోత్సహించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రంలో మూడో సంతానానికి రూ.30 వేలు, నాలుగో సంతానానికి రూ.40 వేల చొప్పున ప్రోత్సాహకం అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 'పిల్లలే సంపద' పేరుతో త్వరలోనే ఈ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారు. జనాభా తగ్గుదల రేటు ఆందోళన కలిగిస్తోందని, దేశ ప్రగతికి పిల్లలే అసలైన సంపద అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. చాలా దేశాల్లో జనాభా తగ్గి వృద్ధుల సంఖ్య పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటున్నాయని ఆయన గుర్తుచేశారు. గతంలో కుటుంబ నియంత్రణపై దృష్టి సారించామని, కానీ మారిన పరిస్థితుల్లో జనాభాను దేశానికి సంపదగా మార్చేందుకు 'పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ'ని తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కొత్త విధానం ద్వారా జననాల రేటును పెంచేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే 'తల్లికి వందనం' కింద రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, తల్లీబిడ్డలకు పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

# ఎడిటర్ వాయిస్

## కేసీఆర్-జగన్-విజయ్ ప్రాంతీయ కూటమి ప్లాన్?

ఒక తాజా ముఖ్యమంత్రితో చేతులు కలిపి ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు తమ రాజకీయ పునరుత్తేజం పొందాలని చూస్తున్నారా. ఏకంగా సౌత్‌లో రీజనల్ రెలీజియన్ ఫ్రంట్ కి శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారా అంటే జరుగుతున్న ప్రచారం బట్టి చూస్తే అవును అనే మాట వస్తోంది. ఆ పార్టీలు బీఆర్ఎస్, వైసీపీ టీవీకే అయితే అధినాయకులు కేసీఆర్ జగన్ విజయ్ అని అంటున్నారు. ఇందులో కేసీఆర్ రెండు సార్లు తెలంగాణాకు సీఎం గా చేసి ఓటమి పాలు అయ్యారు. ఏపీలో ఒకసారి అధికారంలోకి వచ్చిన జగన్ కూడా రెండేళ్ళుగా మాజీ సీఎం గా ఉన్నారు. ఇక రెండేళ్ళ క్రితం పార్టీ పెట్టి తాజాగా తమిళనాడు ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన విజయ్ ఇపుడు కేసీఆర్ జగన్ భవిష్యత్తు రాజకీయాకు ఒక ఆశాకిరణంగా కనిపిస్తున్నారు అని అంటున్నారు.

**రీజనల్ ఫ్రంట్ అంటే :** నిజానికి ఈ రోజున దేశ రాజకీయాలలో ప్రాంతీయ పార్టీలు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. ఎన్డీయేలో జనసేన టీడీపీ ఉంటే మరి కొన్ని పార్టీలు కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమిలో ఉన్నాయి. అయితే ఈ రెండు కూటములలో లేని ఉండలేని ప్రాంతీయ పార్టీలుగా తెలుగు నాట బీఆర్ఎస్ వైసీపీలను చెప్పుకోవాలి. ఈ రెండు పార్టీలకు కాంగ్రెస్ రాజకీయ ప్రత్యర్థి. దాంతో ఇండియా కూటమిలోకి కలవలేరు, అలాగే ఎన్డీయే నాయకత్వంలోని కూటమిలో కూడా చేరలేరు. దాంతో తమకు తాముగా దక్షిణాదిన ఒక ప్రాంతీయ కూటమిని ఏర్పాటు చేసుకుంటే రేపటి రోజున అంటే 2029 ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని కేంద్రంలో ఏర్పాటు చేయడానికి అవసరమైన సీట్లు రాకపోతే తమ బలం అవసరం అవుతుందని అలా తమకు డిమాండ్ ఉంటుందని ఒక కొత్త ప్రయత్నానికి సిద్ధపడుతున్నట్లుగా తెలుస్తోంది.

**అందుకే విజయ్‌తో :** ఇక తమిళనాడులో విజయ్ పార్టీ గెలవడం ఏంటి అటు బీఆర్ఎస్ ఇటు వైసీపీ కూడా పెద్ద ఎత్తున రియాక్ట్ అయిపోయాయి. అంతే కాదు విజయ్ కి కంగ్రాట్స్ చేస్తూ చెలిమికి తెర తీశాయి. ఇక్కడ వైసీపీకి టీవీకేకి సిద్ధాంతపరంగా సారూప్యం కంటే రెండు పార్టీలకూ క్రిస్టియన్ మైనారిటీ ఓటు బేస్ మాత్రం ఒక కామన్ పాయింట్ గా చెబుతున్నారు.ఇక సంక్షేమ పథకాలు ఇతర అంశాలలో జగన్ స్ట్రాటజీని విజయ్ ఫాలో అవుతున్నారని కూడా అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఏపీలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ లతో కూడిన బీజేపీ కూటమిని ఢీ కొట్టాలంటే ఈ సఖ్యత కొత్త కూటమి అవసరం అని వైసీపీ భావిస్తూంటే తెలంగాణాలో కూడా దూసుకుని వస్తున్న బీజేపీని ఎన్డీయే కూటమి ఏర్పాటుని అడ్డుకోవడానికి బీఆర్ఎస్ కూడా విజయ్ వంటి మిత్రుడి వైపు చూస్తోంది అని అంటున్నారు. ఇది కేసీఆర్ కి జగన్ కి రాజకీయ అనివార్యంగా కనిపిస్తుంది అని అంటున్నారు.

**కేసీఆర్ జగన్ అంటేనే :** ఇక కేసీఆర్ జగన్‌ల మధ్య బలమైన స్నేహం ఉంది అన్నది తెలిసిందే. ఇక ఓటమి తరువాత కూడా బెంగళూర్ ఎలహంక ప్యాలెస్ లో కేటీఆర్ జగ్న సమాలోచనలు జరిపారు అని ప్రచారంలో ఉంది. అలాగే ఎలహంక ప్యాలెస్ నుంచి హైదరాబాద్ కి జగన్ రావాలని లోటస్ పాండ్ లో ఆయన మకాం పెట్టాలని బీఆర్ ఎస్ ఒత్తిడి కూడా తెస్తోంది అని అంటున్నారు. వీటి వెనక కూటమి ప్రాంతీయ స్థాయిలో ఏర్పాటు ప్రయత్నం ఉందని అంటున్నారు.

**కాంగ్రెస్‌తో విజయ్ :** అయితే ఈ ప్రాంతీయ స్థాయి కూటమికి ఒక అడ్డంకి ఆదిలోనే ఎదురవుతోంది. అదే విజయ్ కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకోవడం. తన ప్రభుత్వం ఏర్పాటుకు కాంగ్రెస్ మద్దతుని విజయ్ కోరారు. రాహుల్ గాంధీ ఏకంగా ప్రమాణ స్వీకారానికి వచ్చారు. దాంతో ఏపీ తెలంగాణాలలో కాంగ్రెస్ పొడ గిట్టని కేసీఆర్ జగన్ వీటిని ఎలా స్వీకరిస్తారు అన్నదే పెద్ద చర్చగా ఉంది. మరో వైపు చూస్తే ఈ కూటమి ప్రాంతీయ స్థాయిలో మూడు రాష్ట్రాలలో మూడు బలమైన పార్టీల మధ్య ఏర్పాటు కావడానికి ప్రయత్నాలు జరగడం వరకూ ఓకే కానీ ఎవరికి వారి ఓటర్లే ఆయా రాష్ట్రాలలో ఉన్నారు. ఎవరు ఎవరికి రాజకీయంగా



అండగా ఉంటూ ఆయా రాష్ట్రాలలో ప్రోత్సహించుకోలేని పరిస్థితి ఉందని అంటున్నారు. ఎవరి ఓటర్లు వారికే సెపరేట్ గా ఉండడమే అసలైన మైనస్ పాయింట్ అని అంటున్నారు. దానికి తోడు ప్రాంతీయ ఆకాంక్షల వరకూ సరే అనుకున్నా మత రాజకీయాలను మధ్యలోకి తెస్తే మాత్రం అది ప్రమాదమే కాక బూమరాంగ్ అవుతుందని కూడా అంటున్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## నేపాలీ దంపతుల అరెస్ట్..

### 72గంటల్లో జవహర్‌నగర్ చోరీ కేసు ఛేదించిన పోలీసులు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సికింద్రాబాద్‌లోని జవహర్‌నగర్‌లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. వృద్ధ దంపతులను కట్టేసి ఇంట్లో చోరీ చేసిన నేపాలీ ముఠాలో కీలక నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నెల 12న జరిగిన చోరీలో నేపాలీ దంపతులు మమత, రమేశ్‌తోపాటు సబీనాను అదుపులోకి తీసుకు న్నారు. నిందితుల నుంచి బంగారం, వెండి, నగదును స్వాధీనం చేసుకున్నారు. 8 మంది నేపాలీ ముఠా సభ్యులు చోరీ చేసినట్లు పోలీ సులు గుర్తించారు. ఈ కేసు వివరాలను మల్కాజ్‌గిరి సీపీ సుమతి మీడియాకు వెల్లడించారు.

**250కి పైగా సీసీటీవీ ఫుటేజీలు విశ్లేషించి.. 72గంటల్లో ఛేదించి..: సీపీ సుమతి**

ఈ చోరీ కేసును 250కి పైగా సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించడంతో లభించిన క్లూస్ ఆధారంగా 72 గంటల్లో ఈ కేసును ఛేదించినట్లు మల్కాజ్‌గిరి సీపీ సుమతి వెల్లడించారు. పక్కా ప్లాన్‌తో ఇంట్లోకి ప్రవేశించి చోరీకి తెగబడిన ఈ ముఠాలో నలుగురిని అరెస్టు చేశామని, మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. మీనా అలియాస్ మమత పుట్టిన రోజు వేడుకల కోసం మిగతా వారు వచ్చారని యజమానులను నమ్మించి.. వృద్ధ దంపతులను కట్టేసి ఈ ముఠా చోరీకి పాల్పడిందని వివరించారు. ఇకపై ఇంటి యజమానులు ఎవరైనా పనిలో పెట్టుకొనేవారి వివరాలను తాము రూపొందించిన యాప్‌లో నిక్షిప్తం చేయాలని సుమతి సూచించారు.

**ఇదీ జరిగింది..**

జవహర్‌నగర్‌లోని కౌకూర్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో విశ్రాంత ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ (68), భార్య డాక్టర్ విజయలక్ష్మీ (58) నివాసం ఉంటున్నారు. నమ్మకంగా పనికి కుదిరిన నేపాలీ దంపతులు పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటామని చెప్పారు. యజమాని ఇంట్లో చోరీ చేసేందుకే నేపాలీ వాళ్లను మమత, రమేశ్ రప్పించారు. అర్ధరాత్రి దాటాక ఇంటి యజమానులు మురళీధర్, విజయలక్ష్మీ దంపతులను కట్టేసి చోరీకి పాల్పడ్డారు. దాదాపు 75 తులాల బంగారం, 20 కిలోల వెండి, రూ. 30వేల నగదు, 3 వేల డాలర్లతో నేపాలీ ముఠా పరారైంది.

## మంచిగా ఉండమంటే.. తల్లినే చంపేశాడు

### మిత్రుడితో కలిసి 16 ఏళ్ల కుమారుడి ఘాతుకం




**రాజాం, విశ్వం వాయిస్ న్యూస్ :** కన్నా చెడు స్నేహాలు వద్దు.. బాగా చదువుకో అని తల్లి చెప్పిన మాటలు అతడికి చెవికెక్కలేదు. ఇలాంటి మాటలు చెబుతున్న అమ్మను అడ్డుతొలగించుకోవాలని మూర్ఖంగా ఆలోచించాడు. మిత్రుడి సాయంతో తల్లిని కిరాతకంగా హత్య చేశాడు. విజయనగరం జిల్లా రాజాంలో ఈ నెల 4న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు శుక్రవారం వివరాలు వెల్లడించారు. రాజాంకు చెందిన ముంజేటి సతీష్, స్పందన(34) దంపతులు. వీరికి 16 ఏళ్ల కుమారుడు సంతానం. ఇటీవలే పదోతరగతి పూర్తి చేశాడు. పాఠశాలలో ఓ అమ్మాయికి ప్రేమలేఖ రాశాడని స్కూలు యాజమాన్యం తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో మంచిగా మారాలని తల్లి చెబుతూ ఉండేది. ఇది నచ్చని కుమారుడు అమ్మపై కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలోనే మరో బాలుడు(17) క్రికెట్ మైదానంలో ఇతడికి పరిచయమయ్యాడు. తండ్రి తన తల్లిని నిర్లక్ష్యం చేసి మరో మహిళతో ఉంటున్నాడని, వారిని అడ్డు తొలగించుకుని, ముంబయి వెళ్లి డాన్‌లుగా ఎదుగుదామని పరిచయమైన బాలుడు ఇతడితో చెప్పాడు. అలా స్పందన హత్యకు ప్రణాళిక రూపొందించారు.

**ఆకలేస్తోందని పిలిపించి..**

ఈ నెల 4న ఉదయం స్పందన పక్క వీధిలోని పుట్టింటికి వెళ్లింది. ఈ విషయాన్ని బాలుడు స్నేహితుడికి చెప్పడంతో అతడు కత్తితో వీళ్లింటికి వచ్చాడు. బీరువాలోని తొమ్మిదిన్నర తులాల బంగారం, రూ.5 వేలు తీసి బ్యాగులో సర్దుకున్నారు. అమ్మమ్మకు ఫోను చేసి ఆకలిగా ఉంది.. అమ్మను పంపించమని చెప్పాడు. తిరిగి వచ్చిన తల్లి కాళ్లు కడుక్కునేందుకు స్నానాల గదిలోకి వెళ్లగా.. అక్కడే కాపు కాసిన కుమారుడి మిత్రుడు ఆమె పీక పట్టుకున్నాడు. ఇద్దరు కలిసి కత్తితో పొడిచి ఆమెను చంపేశారు. స్పందన శరీరంపై 16 కత్తిపోట్లు ఉన్నాయి. చనిపోయాక చీరతో చుట్టేసి సమీపంలోని కోనేరులో పడేశారు. అనుమానాస్పద మృతిగా భావించిన పోలీసులు స్పందన కుమారుడు కనిపించకపోవడంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది. హత్య తర్వాత ఇద్దరు నిందితులు రైలులో భువనేశ్వర్ వెళ్లారు. ముంబయి, తిరుపతి, విశాఖపట్నం తిరిగి పలాసకు వెళ్లే క్రమంలో చిలకపాలెం వద్ద పోలీసులకు పట్టుబడ్డారు.

బోరుబావిలో పడిన మనవడు..

## రక్షించబోయి తాత మృతి



**మిర్యాలగూడ, విశ్వం వాయిస్ న్యూస్ :** నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఊట్లపల్లిలో విషాదం చోటుచేసుకుంది. వ్యవ సాయ పొలం వద్ద ఉన్న బోరుబావిలో నాలుగేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు పడిపోయాడు. రక్షించేందుకు వెళ్లిన తాత వెంకన్న (50) కూడా అందులో చిక్కుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి వారిద్దరినీ బయటకు తీశారు. ఆస్పత్రికి తరలిస్తుండగా ఊపిరాడక మార్గమధ్యంలోనే వెంకన్న మృతి చెందాడు. బాలుడికి చికిత్స కొనసాగుతోంది.

## గొంతుకోసిన ప్రేమోన్మాది.. యువతి మృతి



**జడ్చర్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఘోరం చోటుచేసుకుంది. యువతిపై ప్రేమోన్మాది కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. తీవ్ర గాయాలపాలైన యువతిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. తన ప్రేమను నిరాకరించిందన్న అక్కసుతోనే నిందితుడు ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. దీంతో అతడిని పట్టుకొని స్థానికులు చితకబాదారు. జడ్చర్లలో ప్రైవేటు స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్న యువతిని గత కొంత కాలం నుంచి ప్రేమ పేరుతో వేధిస్తున్న ఈ ప్రేమోన్మాది.. ఈ రోజు ఆమె బస్సు దిగి వెళ్తున్న సమయంలో కత్తితో దాడికి పాల్పడ్డాడు.

రోగిని తరలిస్తున్న అంబులెన్సుపై

## విరిగిపడ్డ భారీ వృక్షం

**విశ్వం వాయిస్ న్యూస్ :** రోగిని తరలిస్తున్న అంబులెన్సుపై భారీ వృక్షం విరిగిపడిన ఘటన వరంగల్ జిల్లాలో జరిగింది. మధుమేహంతో బాధపడుతున్న సమ్మక్క అనే మహిళ నర్సంపేట జనరల్ ఆస్పత్రిలో చేరారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తరలించాలని వైద్యులు సూచించారు. ఈక్రమంలో లక్నపల్లి శివారులో ఆమెను తీసుకెళ్తున్న అంబులెన్సుపై భారీ వృక్షం కూలింది. ఒక్కసారిగా బలమైన గాలి వీయడంతో ఈ ఘటన జరిగినట్లు అంబులెన్సు డ్రైవర్ తెలిపారు. ఈ ప్రమాదంలో సమ్మక్కతో పాటు వాహనంలో ఉన్న టెక్నీషియన్ అజిత్ బాషాకు గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జేసీబీ సహాయంతో వృక్షాన్ని తొలగించారు. రోగిని మరో అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు.

## వైద్యానికి డబ్బుల్లేక... ఆసుపత్రిలో ఉత్తుత్తి బాంబు..

### పోలీసుల అదుపులో నిందితుడు



**పుణె, విశ్వం వాయిస్ న్యూస్ :** మహారాష్ట్రలోని పుణెలో ఓ యువకుడు చేసిన ఉత్తుత్తి బాంబు నిర్వాకం వెయ్యిమంది పోలీసుల చేత పరుగులు పెట్టించింది. అనారోగ్యంతో బాధపడుతున్న సోలాపుర్ యువకుడు శివాజీ రాథోడ్ తన వైద్యానికి రూ.7 లక్షలు కావాలని ఈ బాంబు పథకం పన్నాడు. పుణెలోని హడప్సర్ వద్ద కామధేను ఎస్టేట్ ఏరియాలో గల ఆసుపత్రిలోని రెండో ఫ్లోరు మరుగుదొడ్లో ఓ అట్టపెట్టెలో శివాజీ ఈ 'బాంబు' దాచి పెట్టాడు. ఓ డిజిటల్ క్లాకు, నాలుగు పైపులు, వైర్లను టేపుతో అతికించాడు. ఆసుపత్రిలో బాంబు పెట్టినట్లు బెదిరింపు జారీచేసి, డబ్బు వసూలు చేయాలన్నది శివాజీ పథకం. 'బాంబు' ఏర్పాటుచేసే క్రమంలో అతికించే టేపు అయిపోవడంతో ఆసుపత్రి సమీపంలోని ఓ దుకాణం నుంచి దాన్ని కొనుగోలు చేసి ఆన్‌లైనులో చెల్లింపు చేశాడు. ఈ క్రమంలో ఆసుపత్రి సిబ్బంది ఆ పెట్టెను బుధవారమే గుర్తించి, పోలీసులకు సమాచారం అందించడంతో శివాజీ అక్కడి నుంచి పరారయ్యాడు. అధికారులు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో పోలీసులను రప్పించి గాలింపు చేపట్టారు. టేపు కోసం దుకాణంలో అతడు చేసిన డిజిటల్ చెల్లింపు ఆధారంగా ఆచూకీ కనిపెట్టిన ఉగ్రవాద వ్యతిరేక దళం నాగ్‌పుర్ రైల్వేస్టేషనులో శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసింది. నేపాల్‌లో ఉన్న తన సోదరి వద్దకు పారిపోయే ప్రయత్నంలో ఉండగా శివాజీని అదుపులోకి తీసుకొన్నట్లు అధికారులు వెల్లడించారు.

# బిజినెస్ వాయిస్

ఆకాశంలో ఎఫ్-16ల కాపలా.. ఒడిలో బిలియన్ల పెట్టుబడులు..

## ప్రధాని మోదీ యూఏఈ పర్యటన సక్సెస్!

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన ఐదు దేశాల సుదీర్ఘ విర్యటనలో భాగంగా యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) సంక్షిప్త పర్యటన భారతదేశానికి వ్యూహాత్మకంగా, ఆర్థికంగా భారీ ప్రయోజనాలను తెచ్చిపెట్టింది. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్న ప్రస్తుత తరుణంలో సాగిన ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన ఐదు దేశాల సుదీర్ఘ విర్యటనలో భాగంగా యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) సంక్షిప్త పర్యటన భారతదేశానికి వ్యూహాత్మకంగా, ఆర్థికంగా భారీ ప్రయోజనాలను తెచ్చిపెట్టింది. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్న ప్రస్తుత తరుణంలో సాగిన ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. శుక్రవారం (మే 15) అబుదాబి చేరుకున్న ప్రధాని మోదీకి యూఏఈ ప్రభుత్వం కళ్లు చెదిరే రీతిలో అపూర్వ స్వాగతం పలికింది. మోదీ విమానం యూఏఈ గగనతలంలోకి ప్రవేశించగానే ఆ దేశానికి చెందిన ఎఫ్-16 యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా నిలిచి రక్షణగా అబుదాబి వరకు తోడ్కొని వచ్చాయి. ఎయిర్‌పోర్ట్‌లో ప్రధాని గౌరవ వందనం స్వీకరించగా, అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్య ఫ్రేమ్‌వర్క్‌పై కీలక ఒప్పందం కుదిరింది. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు మండుతూ పొరుగు దేశాలైన పాకిస్తాన్, నేపాల్‌లలో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతుంటే, భారత్‌లో మాత్రం పరిస్థితి ప్రశాంతంగా ఉంది. దీనికి కారణం భారత్ ముందుచూపుతో తీసుకుంటున్న నిర్ణయాలే. ఒపెక్ కూటమి నుంచి యూఏఈ బయటకు రావడంతో క్రూడాయిల్ ఉత్పత్తిపై పరిమితులు



తొలిగాయి. దీనిని అనుకూలంగా మార్చుకుంటూ భారత్ రెండు కీలక ఒప్పందాలు చేసుకుంది. ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ నిరంతర సరఫరా చేసేలా ఇరు దేశాలు కీలక ఒప్పందం చేసుకున్నాయి. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలపై అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆర్థిక రంగాన్ని బలోపేతం చేస్తూ భారత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్‌బిఎల్ బ్యాంక్, మరియు సమ్మాన్ క్యాపిటల్‌లలో 5 బిలియన్ డాలర్ల సుమారు రూ. 41,000 కోట్లు భారీ పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈ అంగీకరించింది. అలాగే వడినార్‌లో షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించి మరో వీశీఖ కుదిరింది. ఈ సందర్భంగా యూఏఈపై జరుగుతున్న దాడులను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండిస్తూ, చర్చల ద్వారానే పశ్చిమాసియా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు. అరేబియా తీరం నుండి ఐరోపాలోని నార్డిక్ దేశాల వరకు సాగే ఈ టూర్‌లో భాగంగా ప్రధాని తదుపరి దశల్లో నెదర్లాండ్స్, 43 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత నార్వే, మరియు స్వీడన్ (గోథెన్‌బర్గ్) లలో పర్యటించనున్నారు. ఇటలీతో రక్షణ బంధాన్ని, స్వీడన్‌తో వాణిజ్యాన్ని, నెదర్లాండ్స్‌తో ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ పర్యటన కొనసాగుతోంది.

నెలకు జస్ట్ రూ.10వేల పెట్టుబడి..

## సామాన్యుడిని కూడా కోటీశ్వరుడిని చేసే సూపర్ స్కీమ్

దేశ ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగు పర్చేందుకు, పోస్ట్ ఆఫీస్ వివిధ రకాల పొదుపు, పెట్టుబడి పథకాలను అందిస్తోంది. కానీ వీటి గురించి చాలా మంది తెలియదు. అయితే పోస్టల్ సేవింగ్స్ స్కీమ్స్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా రూ.1 కోటి వరకు పొందవచ్చు. అదెలానో ఇప్పుడు మనం తెలుసుకుందాం. ప్రతి ఒక్కరికీ సురక్షితమైన, స్థిరమైన ఆర్థిక భవిష్యత్తు ఉండాలనే కోరిక ఉంటుంది. అందుకోసం చాలా మంది రాత్రింబగళ్లు కష్టపడి పనిచేస్తుంటారు. ఎంత కష్టపడి సంపాదించినప్పటికీ, చాలా మంది తాము అనుకున్న ఆర్థిక లక్ష్యాన్ని చేరుకోలేకపోతుంటారు. దానికి ప్రధాన కారణం.. సంపాదించిన డబ్బును సరైన మార్గంలో పెట్టుబడి పెట్టి పెంచుకోకపోవడమే. ఇందుకోసమే ప్రభుత్వం పలు రకాల పొదుపు, పెట్టుబడి పథకాలను అమలు చేస్తోంది. వీటిలో పెట్టుబడి పెట్టడం ద్వారా సామాన్య ప్రజలు సైతం రూ.1 కోటి అనే లక్ష్యాన్ని చాలా సులభంగా చేరుకోవచ్చు. కాబట్టి ఏ పథకంలో ఎలా పెట్టుబడి పెడితే ఈ రూ.1 కోటి లక్ష్యాన్ని సాధించవచ్చో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. మీరు ప్రభుత్వ పొదుపు పథకాల ద్వారా రూ.1 కోటి వరకు సంపాధించాలి అనుకుంటే, ఒక వ్యక్తి ఖచ్చితంగా రెండు ప్రత్యేక పథకాల్లో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అవే పోస్ట్ ఆఫీస్ టైమ్ డిపాజిట్ స్కీమ్ , పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్ స్కీమ్.

**పోస్ట్ ఆఫీస్ టైమ్ డిపాజిట్ స్కీమ్**

ఫిక్స్‌డ్ డిపాజిట్, టైమ్ డిపాజిట్ రెండు కూడా ఒకే రకమైన పథకాలు. ప్రస్తుతం ఈ పథకానికి ఏడాదికి 7.5 శాతం వడ్డీ లభిస్తోంది. ఈ స్కీమ్ ద్వారా మీరు మీ పెట్టుబడిని రూ. 1 కోటి వరకు పెంచుకోవాలి అనుకుంటే. 5 సంవత్సరాల పాటు ఈ స్కీమ్‌లో రూ. 10 లక్షలు పెట్టుబడి పెట్టాలి. మీరు పెట్టుబడి పెట్టిన రూ.10 లక్షల డబ్బు 5 ఏళ్ల ముగిసేసరికి వడ్డీతో కలిపి రూ.14,49,948 అవుతుంది. ఇదే మొత్తాన్ని విత్‌డ్రా



చేయకుండా ప్రతి 5 ఏళ్లకు ఒకసారి చొప్పున మొత్తం 20 సంవత్సరాల పాటు అలాగే కొనసాగించాలి. 20 ఏళ్ల తర్వాత మీ రూ.10 లక్షల ప్రారంభ పెట్టుబడి మొత్తం రూ.44,19,877 గా మారుతుంది.

**పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్ స్కీమ్**

టైమ్ డిపాజిట్ లాగే, ఈ పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్ పథకంలో కూడా 20 ఏళ్ల పాటు పెట్టుబడిని కొనసాగించాల్సి ఉంటుంది. నెలకు రూ.10,000 చొప్పున 6.7% వడ్డీతో మీ చేతికి రూ. 7,13,659 వస్తాయి. తర్వాత ఈ రూ.7.13 లక్షలను 7.5% వడ్డీ ఇచ్చే 5 ఏళ్ల టైమ్ డిపాజిట్ లో వేయాలి. దీనితో పాటు సమాంతరంగా మళ్లీ నెలకు రూ.10,000 కొత్త ఆర్డీ మొదలుపెట్టాలి. పేదళ్లు ముగిసే సరికి పాత ఎఫ్‌డీ వడ్డీతో కలిపి రూ.10.34 లక్షలు అవుతుంది. కొత్త ఆర్డీ ద్వారా మరో రూ.7.13 లక్షలు వస్తాయి. మొత్తం కలిపి రూ.17.47 లక్షలు అవుతుంది. ఈ పథకాన్ని ఇలానే క్రమం తప్పకుండా 20 సంవత్సరాల పాటు ప్రతి నెలా రూ.10,000 పెట్టుబడి పెడుతూ పోతే, గడువు ముగిసేసరికి మీకు మొత్తం రూ.63,50,000 లభిస్తుంది.

### ప్రచారంలో ఉన్న ఉత్సాహం..

# ఏర్పాట్లలో లేదని విమర్శలు

• తగు ఏర్పాట్లు చేయని అధికారులు • మందపల్లి శని దేవుని ఆలయంలో భక్తుల ఇక్కట్లు






**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమలోని మందపల్లి శనీశ్వర స్వామి దేవాలయంలో భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు. శనివారం అమావాస్య కావడం, అలాగే శని జయంతి పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. భారతదేశంలోనే పేరుగాంచిన శని దేవుని ఆలయం కావడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో టిక్కెట్లు తీసుకునే కౌంటర్ దగ్గర భారీగా రద్దీ ఏర్పడింది. తైలాభిషేకాలు తదితర పూజ టిక్కెట్లు తీసుకునేందుకు భక్తులు నానా ఇక్కట్లు పడ్డారు. అలాగే భక్తుల తీవ్రత ఎక్కువ అవ్వడంతో అధికారులు ఆలయం ప్రధాన ద్వారాలను మూసివేశారు. దీంతో భక్తులు స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. భక్తులు ఒకరినొకరు తోసుకునే పరిస్థితి ఏర్పడడంతో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. భక్తుల రద్దీని ముందుగా అంచనా వేయలేకపోయిన ఆలయ అధికారులు ఏర్పాట్లను సక్రమంగా చేయలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో ఓ ప్రైవేటు ఆలయంలో ఏర్పాట్లు సక్రమంగా లేకపోవడంతో తొక్కిసలాట జరిగి కొందరు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఇదే పరిస్థితి ఇక్కడ జరుగుతుందేమోనని భయపడ్డామని వాపోయారు. ఈ పరిస్థితిని కవర్ చేయడానికి వెళ్ళిన మీడియా ప్రతినిధులను కూడా లోపలికి రానీయకపోవడంతో అసంతృప్తి వ్యక్తం అయింది. ఇప్పటినుంచైనా ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేయాలని పలువురు అభిప్రాయపడ్డారు.

**ప్రచారానికి తగ్గ ఏర్పాట్లు లేకనే ఇక్కట్లు**

గత కొన్ని రోజులుగా మందపల్లి శనీశ్వర స్వామి దేవస్థానం అధికారులు ప్రచారం జోరుగా చేశారు. ఈనెల 16 వ తారీఖున శనిజయంతి అని, అభిషేకం చేయించుకుంటే మంచి జరుగుతుందని ప్రచారం చేశారు. ఫేస్బుక్, వాట్సాప్, ఇంస్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా సమాచారం చేరవేశారు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. అయితే దేవస్థానం అధికారులు ప్రచారం చేయడంలో చూపిన ఉత్సాహం.. ఏర్పాట్లు చేయడంలో కనిపించలేదని పలువురు భక్తులు మండిపడ్డారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని పోలీసు సిబ్బందిని, అలాగే సేవలు చేసే సభ్యులను ఎక్కువ మందిని ఏర్పాటు చేయలేకపోయారని చెప్పారు. దీంతో తాము నానా ఇబ్బందులకు, ఇక్కట్లకు గురయ్యామని వాపోయారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శించుకున్నారు ఇటువంటి ఇబ్బందులు చూడాలని అధికారులని కోరుకున్నారు.

### మండపేటలో మున్సిపల్ స్కూలు


# అదనపు తరగతుల భవనం ప్రారంభం




**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పురపాలక సంఘం పరిధిలోని గొల్లపుంతలో రూ.19.90 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మించిన సర్దార్ శ్రీ వేగుళ్ళ వీర్రాజు మున్సిపల్ స్కూలు అదనపు తరగతుల భవనాన్ని శనివారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర” కార్యక్రమంలో భాగంగా “సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం”పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెప్మా ఆర్.పి.లు, మున్సిపల్ సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ ప్రత్యేక అధికారి ఆర్.డి.ఎం.ఎ నాగ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ టి.వి. రంగారావు, మండపేట మండల విద్యాశాఖ అధికారులు నాయుడు రామచంద్రరావు చింతా సోమిరెడ్డి, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, డిప్యూటీ ఈ.ఈ కె. శ్రీనివాస్, ఎం.ఈ.ఓ రామచంద్రరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎం. సత్తిరాజు, మెప్మా సి.ఎం.ఎం పి. సుజాత, సి.ఓలు, ఆర్.పి.లు పాల్గొన్నారు.

### కంబాల జన్మదినోత్సవం సందర్భంగా

# నరసన్నకు ప్రత్యేక పూజలు : సీతాదేవి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు జన్మదినోత్సవ వేడుకలు కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. శనివారం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు రాజానగరం, జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గం హిందూ ధర్మ పరిరక్షణకు, ఆపదలో ఉన్న వారికి నేనున్నానంటూ అభయ హస్తం అందించే కంబాల సేవలు మూడు నియోజకవర్గాల ప్రజలకు విధితమే. కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి, అమ్మవార్ల జాతర్లకు, ఆపదలో ఉన్నవారికి లక్షలాది రూపాయల విరాళాలు అందజేస్తూ పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజల మనలను పొందుతున్న కంబాల శ్రీనివాసరావు భవిష్యత్తులో మరిన్ని పుట్టినరోజులు జరుపుకొని, అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలను పొందాలని, భవిష్యత్తులో భారతీయ జనతా పార్టీలో ఉన్నతి శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ కోరుకొండ గ్రామానికి చెందిన రామాయణపు సీతాదేవి శనివారం కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా ఆమె పత్రిక ముఖంగా కంబాల శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

### సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

# జాతీయ డెంగ్యూ దినోత్సవం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జగదీష్ కృష్ణ ఆధ్వర్యంలో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో జాతీయ డెంగ్యూ దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని డెంగ్యూ నిర్మూలన గురించి అవగాహన ర్యాలీ మరియు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి రావడానికి ఈడిష్ అనే దోమ కారణమని ఈ వ్యాధి ఒక మనిషి నుంచి ఇంకొకనికి దోమలు కుట్టడం వల్ల వ్యాపిస్తుందని డెంగ్యూ వ్యాధి సోకిన తర్వాత నిర్లక్ష్యం చేస్తే మరణం కూడా సంభవిస్తుందని, కావున ప్రజలందరూ ఇంటి పరిసరాల్లో ఇంటి లోపల నీటి నిలువలు లేకుండా జాగ్రత్త పడాలని, తద్వారా డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చని ప్రతి ఒక్కరూ నిలువ నీటిని పరిశీలించడం, శుభ్రం చేయడం, నీటి తొట్టి పై మూత పెట్టడం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీతానగరం పి హెచ్ సి ఎంపీ హెచ్ ఈ ఓ వై.ఎస్ రాయుడు,పి హెచ్ ఎన్ కె.ఆదిలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ కే.సుధాకర్, ఫార్మసీ ఆఫీసర్ నగేష్,ఎల్ టి శిల్పా సౌందర్య,ఎం ఎల్ హెచ్ పి.సౌజన్య, హెల్త్ అసిస్టెంట్ పి.నందీష్, సూర్యచంద్ర, కిషోర్, ఏఎన్ఎంలు ఎస్ కె సలీమా, కుమారి, సంధ్య, పి.హెచ్.సి ఓపి సిబ్బంది కిరణ్మయి, చైతన్య, ఆశ కార్యకర్తలు కుమారి, విజయ, విజయ కుమారి మరియు ప్రజలు పాల్గొన్నారు.

# వరి కొయ్యల దహనంతో ముంచుకొస్తున్న ముప్పు

### తక్షణ చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ విన్నపం





**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వరి కోతల అనంతరం మిగిలిన కాండాన్ని పొలాల్లోనే నిప్పు పెట్టి కాల్చివేయడం వల్ల పర్యావరణానికి, భూసారానికి ప్రజారోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని జనసేన పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రమాదకరమైన పద్ధతిని అరికట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగం ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ శాఖలు తక్షణమే రంగంలోకి దిగి తగిన చర్యలు తీసుకోవాలని రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ తరపున అధికారులకు సవినయంగా విన్నవించారు. పంట వ్యర్థాలను తగులబెట్టడం వల్ల భూమి ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగి నేలలో ఉండే సేంద్రీయ కార్బన్ పూర్తిగా నాశనమవుతుందని జనసేన నేతలు శాస్త్రీయంగా వివరించారు. దీనివల్ల నేలకు అత్యంత అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాషియంతో పాటు జింక్, సల్ఫర్ వంటి ముఖ్యమైన సూక్ష్మ పోషకాలు కాలి బూడిదవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి పైపొరల్లో ఉంటూ పంటలకు మేలు చేసే బ్యాక్టీరియా, సిలీంద్రాలు, మిత్ర పురుగులు మరణించడం వల్ల భూమి నిస్సారంగా మారుతుందని హెచ్చరించారు. నేల గట్టిపడి నీటిని నిలుపుకునే శక్తి గణనీయంగా తగ్గిపోతుందని ఫలితంగా తదుపరి వేసే పంటలు త్వరగా ఎండిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. భూసార నష్టంతో పాటు ఈ కాల్పుల వల్ల వాతావరణంలో కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డైయాక్సైడ్ వంటి ప్రమాదకరమైన వాయువులు కలిసిపోయి తీవ్రమైన వాయు కాలుష్యం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల స్థానిక ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్రమైన శ్వాసకోశ సంబంధిత జబ్బుల బారిన పడే అవకాశం ఉందన్నారు. రైతులు ఈ ప్రమాదకరమైన పద్ధతికి స్వస్తి చెప్పి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని జనసేన పార్టీ పిలుపునిచ్చింది. పంట కోతల తర్వాత పొలాన్ని నేరుగా దుక్కి దున్నడం లేదా 'వేస్ట్ డీకంపోజర్లను' వాడి వ్యర్థాలు త్వరగా కుళ్లిపోయేలా చేయడం ద్వారా భూసారాన్ని సులభంగా పెంచుకోవచ్చని సూచించారు. ఈ రకమైన మేలైన చర్యలపై రామచంద్రపురం నియోజకవర్గంలోని రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ కాల్పుల విధానాన్ని పూర్తిగా నియంత్రించేలా వ్యవసాయ శాఖ తగిన చర్యలు చేపట్టాలని నియోజకవర్గ జనసేన పార్టీ తరపున డిమాండ్ చేశారు.

# త్వరలో అర్హులకు ఇళ్లు... పెన్షన్లు

### ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హామి




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి వారం నిర్వహిస్తున్నట్లుగానే రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ పరిధిలోని 3 మరియు 4 డివిజన్ల ప్రజల సమస్యల పరిష్కారానికి రాజేంద్రనగర్ 16 కుళాయిల సెంటర్ సచివాలయం వద్ద ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నక్కా చిట్టిబాబు సంయుక్త ఆధ్వర్యంలో, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వర ప్రసాద్ పర్యవేక్షణలో, టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పెన్షన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వివిధ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన సమస్యలపై ప్రజలు తమ వినతిపత్రాలను ఎమ్మెల్యే వాసుకు అందజేశారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు సిఫార్సు చేసి, త్వరితగతిన పరిష్కారాలు చూపించాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాల కోసం దాఖలు చేసిన దరఖాస్తులు, ఎన్నికల ముందు పంపిణీ చేసిన పట్టాలపై ప్రజల్లో నెలకొన్న సందేహాలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టత ఇచ్చారు. కానవరం - పల్లకడియం ప్రాంతంలో న్యాయపరమైన సమస్యలు తొలగిపోయాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.31 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. త్వరలోనే 10,345 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే బూరుపూడి ప్రాంతంలో గత ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించిందని విమర్శించిన ఆయన, అక్కడి బాధితులకు కూడా భూములు కేటాయించి పట్టాలు అందించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఇళ్ల సమస్యల పరిష్కారంలో భాగంగా రాజేంద్రనగర్, సుబ్బారావుపేట, క్వారీ ప్రాంతం సహా 11 ప్రాంతాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూసమస్యలకు పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే వాసు తెలిపారు. సుమారు 9,800 మంది లబ్ధిదారులకు చట్టబద్ధ రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గతంలో నిర్వహించిన “మీ భద్రత - మా బాధ్యత” కార్యక్రమం ఫలితాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రస్తావించారు. రాజేంద్రనగర్ రైతు బజార్ ప్రాంతం సాయంత్రం వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారిందని ప్రజలు ఫిర్యాదు చేయడంతో, దానిని ప్రజలకు ఉపయోగపడే విధంగా సచివాలయంగా మార్చామని తెలిపారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్‌ను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. 3 మరియు 4వ డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించిన ఎమ్మెల్యే వాసు నాలుగో వార్డులో రూ.52 లక్షలతో రోడ్లు, డ్రైన్లు పూర్తి చేశామని, మరో రూ.23 లక్షల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అదనంగా రూ.1.89 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. మూడో వార్డులో రూ.20 లక్షల పనులు పూర్తయ్యాయని, రూ.10 లక్షల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. బైబిల్ ప్యాలెస్ నుంచి సాయిబాబా ఆలయం మీదుగా ఆర్ట్స్ కాలేజ్ వరకు రూ.1.80 కోట్ల రహదారి పనులకు ఆమోదం లభించిందని వెల్లడించారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత కోసం ప్రజా దర్బార్‌లు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. అర్హులైన వారి వివరాలను సచివాలయాల్లో నమోదు చేసి, ప్రభుత్వం కొత్త పథకాలు ప్రకటించిన వెంటనే లబ్ధి అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళా భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్పష్టం చేశారు. దేశంలో ఇంధన వినియోగాన్ని తగ్గించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపును స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఇప్పటికే కాన్వాయ్ వాహనాల వినియోగాన్ని తగ్గించారని తెలిపారు. తాను కూడా వారంలో ఒకరోజు సైకిల్‌పై ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ప్రతిపక్ష వైసీపీ నాయకుల విమర్శలను ఎమ్మెల్యే వాసు తీవ్రంగా ఖండించారు. దేశ ప్రయోజనాల కోసం తీసుకుంటున్న మంచి నిర్ణయాలను కూడా విమర్శించడం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్, నాయకులు దొండపాటి సత్యంబాబు, జక్కంపూడి అర్జున్, యాళ్ల శ్రీను, బండారు శ్రీను, అప్పరి, దాస్యం ప్రసాద్, సలాది ఆనంద్, కూటమి నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
ఆదివారం, 17 మే 2026
www.viswamvoice.com





# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం..

## జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం - జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతి రమణీయతకు, పచ్చదనానికి నిలయమైన డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాను సంపూర్ణ ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రైతు బజార్ వద్ద నిర్వహించిన "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ రహిత జిల్లా లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత 16 నెలలుగా ప్రతి నెల మూడో శనివారం ప్రభుత్వం "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేసి,



భావితరాలకు స్వచ్ఛమైన, పచ్చని కోనసీమను అందించాలని కోరారు. ఒక్కసారి మాత్రమే వాడి పారేసే ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, స్పూన్లు, స్ట్రాలు, క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ జెండాలు, ఫ్లెక్సీల వినియోగంపై జిల్లా వ్యాప్తంగా పూర్తి నిషేధం అమలులో ఉందన్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల స్థానంలో జనపనార, జూట్ బ్యాగులు, గుడ్డ సంచులు, కాగితపు సంచులను వినియోగించాలని సూచించారు. జీవ వైవిధ్యం మన సంపద అని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల నుంచే మార్పు ప్రారంభించాలని అన్నారు. దుకాణాలకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా గుడ్డ సంచి తీసుకెళ్లడాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. అందరి సహకారంతో కోనసీమ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ ప్లాస్టిక్ రహిత జిల్లాగా నిలబెట్టాలని కోరారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ, ప్రకృతి రమణీయతకు ప్రతీకగా నిలిచిన కోనసీమను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గతంలో "క్లీన్ అండ్ గ్రీన్" కార్యక్రమంతో పచ్చదనం, పరిశుభ్రతకు నాంది పలికిన ప్రభుత్వం, ప్రస్తుతం "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తోందన్నారు. పురపాలక యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని, ప్రజలు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు ప్లాస్టిక్ రహిత కోనసీమ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా జూట్ బ్యాగులు, గుడ్డ సంచులను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ మాట్లాడుతూ, శుభకార్యాల్లో ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా సంప్రదాయ విస్తరాకులు, మట్టి పాత్రలను ప్రోత్సహించాలని సూచించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయం లేదా నిల్వపై నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ బృందాల ద్వారా విస్తృత తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్లాస్టిక్ వల్ల భూగర్భ జలాలు కలుషితమవ్వడమే కాకుండా పశుపక్ష్యాదుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతోందన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్తిబాబు, నాయకులు రాజా బి.వెంకటరమణ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

### నేరాల నియంత్రణపై జిల్లా పోలీసుల సమీక్ష సమావేశం : జిల్లా ఎస్పి రాహుల్ మీనా



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో మాసిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఉప విభాగ పోలీసు అధికారులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి నేరాల అదుపు, పెండింగ్ కేసులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై సుదీర్ఘంగా సమీక్షించారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ డేటా ఆధారంగా జిల్లాలో నమోదైన కేసుల ప్రస్తుత స్థితిగతులను ఎస్పీ సమీక్షించారు. ముఖ్యంగా మూడేళ్లకు పైబడి పెండింగ్‌లో ఉన్న గుర్తుతెలియని కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. డ్రోన్ వినియోగం, 112 అత్యవసర సేవలు, ఈ-చలానా వసూళ్లు మరియు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఈ-సాక్ష్య, సీఈఐఆర్ రిపోర్ట్ మరియు మెడ్‌లీపీఆర్ అప్లికేషన్ల పనితీరుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే వారం రోజుల్లో జరగబోయే జాతరలు, పండుగల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాలపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కులపరమైన సమస్యలు తలెత్తకుండా సామరస్య కమిటీల ద్వారా శాంతిని నెలకొల్పాలని సూచించారు. రాత్రి సమయాల్లో గస్తీ పెంచాలని, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు చేరువ కావాలని అధికారులకు తెలిపారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని, పెండింగ్‌లో ఉన్న వారెంట్లు, అరెస్టులను వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే 11-07-2026న జరగనున్న లోక్ అదాలత్ కోసం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని ఎస్పీ రాహుల్ మీనా కోరారు.

# చలివేంద్రం ప్రారంభించిన వాసవి క్లబ్ గవర్నర్ బోడా వీర్రాజు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు శనివారం అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం వాసవి క్లబ్,హైటెక్ వనిత క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసారు. స్థానిక కళావెంకట్రావు సెంటర్ వద్ద వాసవి క్లబ్ గవర్నర్ బోడా వీర్రాజు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణికులకు, పాదచారులకు స్వయంగా మజ్జిగ అందించారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా చలివేంద్రం ద్వారా ప్రతిరోజూ ఉచితంగా చల్లని మజ్జిగ,మంచి నీళ్ళు అందిస్తున్న వాసవి క్లబ్ ప్రెసిడెంట్ పులవర్తి గోపాలకృష్ణ, హైటెక్ వనిత క్లబ్ ప్రెసిడెంట్ కుసుమంచి ధనశ్రీ సతీష్ మరియు సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్యం వర్ధనరావు,మన్యం భాను,పచ్చిపులుసు నారాయణ మూర్తి, మండవిల్లి నగేష్, మండవిల్లి చిట్టిబాబు, కంకటాల హరి,దొండపాటి మూర్తి, కొల్లేపర నర్సింహా మూర్తి,భూర్లే సుబ్బారావు, యలమర్తి రమణ,వెత్సా దొరబాబు,యలమర్తి గణేష్,మన్యం కామేశ్వరరావు,చిప్పాడా సత్యనారాయణ,ఎంపీటీసీ సభ్యులు బొక్కా ప్రసాద్, మేడపాటి సత్యనారాయణ రెడ్డి,గోకవరపు పద్మనాభం,తుమ్మలపల్లి గోపాలం, అత్యం లక్ష్మీ నారాయణ, కేసవరపు మాణిక్యం, గోకవరపు సుశీల, భూర్ల సత్య అధికసంఖ్యలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి పనుల పర్యవేక్షణలో అధికారుల నిర్లక్ష్యం

### వేగయ్యమ్మపేటలో వాహనదారుల తీవ్ర ఇబ్బందులు



**వేగాయమ్మపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** యానాం – రామచంద్రపురం మార్గంలోని వేగాయమ్మపేట గ్రామంలో ప్రస్తుతం జరుగుతున్న రహదారి నిర్మాణ పనులు వాహనదారులకు తీవ్ర నరకాన్ని చూపుతున్నాయి. అధికారుల ముందస్తు ప్రణాళిక లోపం నిర్లక్ష్యం కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సాధారణంగా రహదారి పనులు జరిగేటప్పుడు వాహనాలను ముందుగానే వేరే మార్గంలోకి మళ్లించడానికి ప్రధాన కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. యానం వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు లోపలికి రాకుండా ఉండాలంటే ఎర్రపోతవరం టర్నింగ్ వద్దే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలి. అలా చేస్తే, పెద్ద వాహనాలన్నీ ఎర్రపోతవరం నుంచి పెద్ద కాలువ గట్టు మీదుగా వెంకటాయాపాలెం రోడ్డుకు చేరుకుని తమ గమ్యస్థానాలకు సులువుగా వెళ్లే అవకాశం ఉంటుంది. అయితే రోడ్డు వేసే అధికారులు ఎర్రపోతవరం వద్ద బోర్డు పెట్టకుండా అక్కడి నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల లోపలికి వచ్చిన తర్వాత వేగయ్యమ్మపేట గ్రామ సమీపంలో బోర్డు ఏర్పాటు చేశారు. అధికారుల ఈ చిన్న తప్పిదం వల్ల యానం నుంచి వచ్చే వందలాది వాహనాలు ముఖ్యంగా భారీ లారీలు,బస్సులు రోడ్డు పనులు జరుగుతున్న విషయం తెలియక రెండు కిలోమీటర్ల మేర లోపలికి వచ్చేస్తున్నాయి. తీరా వేగాయమ్మపేట వద్దకు వచ్చాక రోడ్డు మూసివేసి ఉండటాన్ని చూసి డ్రైవర్లు విస్తుపోతున్నారు. అక్కడ రోడ్డు ఇరుకుగా ఉండటంతో పెద్ద వాహనాలు వెనక్కి తిరగడానికి గంటల తరబడి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. దీనివల్ల వాహనదారులకు సమయం ఇంధనం వృథా అవ్వడమే కాకుండా వేగాయమ్మపేట గ్రామ పరిధిలో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడి స్థానికులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు వేసే కాంట్రాక్టర్ సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వేగయ్యమ్మపేట వద్ద ఉన్న హెచ్చరిక బోర్డును తక్షణమే ఎర్రపోతవరం కూడలి వద్దకు మార్చాలని స్థానికులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. అక్కడ స్పష్టమైన డైవర్షన్ బోర్డు ఏర్పాటు చేసి భారీ వాహనాలను పెద్ద కాలువ గట్టు మీదుగా వెంకటాయాపాలెం రోడ్డు వైపు మళ్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

#### జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల రెండవ రోజు

# విజేతలకు బహుమతి ప్రదానం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో ఎంపీ జి.ఎం.హరీష్ బాలయోగి చైర్మన్‌షిప్‌లో నిర్వహిస్తున్న 15వ జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ మెన్ అండ్ ఉమెన్స్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో దేశంలోని 29 రాష్ట్రాల నుంచి సుమారు 900 మంది లిఫ్టర్లు పాల్గొంటున్నారు. పోటీల రెండవ రోజు నిర్వహించిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి అమలాపురం మున్సిపల్ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మెట్ల రమణబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అమలాపురంలో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని, యువత శారీరక దృఢత్వం పెంపొందించుకోవడానికి క్రీడలు ఎంతో ఉపయోగకరమని వారు పేర్కొన్నారు. అనంతరం జాతీయ స్థాయి పోటీల్లో విజేతలైన క్రీడాకారులు, క్రీడాకారిణులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకులు యాళ్ల దొరబాబు, బోనం సత్తిబాబు, రవణం వేణుగోపాల్ రావు, గారపాటి చంద్రశేఖర్, అశెట్టి అదిబాబు, గోకరకొండ సూరిబాబు, పప్పుల శ్రీరామచంద్రమూర్తి అతిథులుగా పాల్గొన్నారు.విజేతల వివరాలను ఆర్గనైజింగ్ సెక్రటరీ కంకిపాటి వెంకటేశ్వర తెలిపారు.

# జిల్లాలోని ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

### డిజిటలైజేషన్, వెరిఫికేషన్ ప్రక్రియలపై సమగ్ర చర్చ, పార్టీ బలోపేతం

### రాష్ట్ర కార్యదర్శులతో సార్ గురించి కీలక సమావేశం నిర్వహించిన జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం మండలం రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద ఈరోజు రాష్ట్ర కార్యదర్శులతో (పార్లమెంట్) జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ డిజిటలైజేషన్ కార్యక్రమాలు, వెరిఫికేషన్ ప్రక్రియలను మరింత పారదర్శకంగా మరియు వేగవంతంగా చేపట్టే అంశాలపై సవివరంగా చర్చించారు. పార్టీ శ్రేణులు గ్రామస్థాయి నుంచి మరింత సమన్వయంతో పనిచేయాలని, ప్రతి కార్యకర్తకు పార్టీ కార్యక్రమాలు చేరేలా ఆధునిక సాంకేతిక విధానాలను వినియోగించాలని సూచించారు. అలాగే జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ వైఫల్యాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ప్రజల సమస్యల పరిష్కారంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి రాష్ట్ర నాయకత్వం సూచించిన విధంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కి సంబంధించిన రాష్ట్ర కార్యదర్శులు (పార్లమెంట్) పాల్గొన్నారు.

# భక్తుల సంఖ్యను అంచనా వేయలేకపోయిన అధికారులు

### శని జయంతి, అధిక సంఖ్యలో భక్తులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవాలయాలపై ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేక దృష్టి మందపల్లి శనీశ్వర దేవాలయంలో 4 కోట్ల 50 లక్షలు రూపాయలతో అభివృద్ధి పనులు ప్రసిద్ధిగాంచిన కొత్తపేట మండలం మందపల్లి శనీశ్వర దేవాలయంలో శనివారం, శని జయంతి అమావాస్య, పర్వదినం కావడంతో భక్తుల సంఖ్య అధికమైంది. పర్వదినం కావడంతో ప్రచారం మాధ్యమాలలో ఎక్కువగా ప్రచారం చేశారు.ప్రచారం అయితే చేసేసారు గానీ.భక్తుల సంఖ్యను అధికారులు అంచనా వేయలేకపోయారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. దాంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు బుకింగ్ కౌంటర్లో మాత్రమే ఏర్పాటు చేయడంతో టికెట్ బుకింగ్ కౌంటర్లు వద్ద రద్దీ ఎక్కువైంది. క్యూలైన్లు ఏర్పాటు చేయలేకపోయారు.భక్తులు ఎగబడి గెంటేసుకోవడంతో అసౌకర్యానికి గురయ్యారు. ఇది కేవలం అధికారులు భక్తులను అంచనా వేయలేక పోవడం వలనే ఈ ఇబ్బందులు తలెత్తాయి. ఇంతకంటే అధిక సంఖ్యలో శని త్రయోదశి నాడు భక్తులు వస్తుంటారు. ఎప్పుడూ ఇటువంటి ఇబ్బందులు తలెత్తలేదు దానికి తగ్గ ఏర్పాట్లు చేస్తారు. పర్వ దినాలలో ఎక్కువ సిబ్బంది అవసరమైనప్పుడు పాలకులు దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి బయట దేవాలయాల నుండి సిబ్బందిని తెచ్చుకుంటారు. భక్తులను అంచనా వేయలేకే జరిగిన అధికారుల ఇబ్బందిగా దీనిని పరిగణించాలి. పాలకులను విమర్శించడం తగదు.కూటమి ప్రభుత్వం దేవాలయాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేవాలయ అధికారులను, సిబ్బందిని పదేపదే హెచ్చరిస్తున్నారు. దేవాలయాలకు వచ్చే భక్తుల సౌకర్యాలపై సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.దేవాలయ అభివృద్ధిపై కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేక దిష్టి సారిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం అనేక ఏర్పాట్లు చేస్తూ భవనాలు నిర్మిస్తున్నారు.దేవాలయ ప్రాంగణంలో మూడు కోట్ల రూపాయల వ్యయంతో తైలాభిషేక మండపం కోటి యాభై లక్షలు రూపాయలతో అన్నదాన భవనం నిర్మిస్తున్నారు. ఈ భవనాలు నిర్మాణాలు జరగడం కూడా ఇబ్బందులు తలెత్తాయి.. బయట జాగా లేకపోవడంతో భక్తులంతా గుడి ప్రాంగణంలోనే ఒకే చోట కేంద్రీకృతమయ్యారు. దాంతో కిక్కిరిసిన పరిస్థితి ఏర్పడింది.భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఇటువంటి తప్పిదాలు జరగకుండా అధికారులు బాధ్యత వహించవలసిందిగా సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి కూటమి పార్టీ నేతలు కోరుతున్నారు.

# వైభవంగా పెనికేరు గ్రామ దేవత పోలేరమ్మ వారి జాతర మహోత్సవం



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం పరిధిలో పెనికేరు గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర తీర్థ మహోత్సవాలు శుక్రవారం రాత్రి భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో పాటు ప్రముఖ సామాజిక సేవకుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వెంకటేశ్వర సంస్థల అధినేత ఈదర చిన్నబాబు అందించిన ఆర్థిక సహాయ సహకారాలతో ఈ ఏడాది జాతర మరింత ఘనంగా నిర్వహించబడిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఈదర చిన్నబాబు పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. జాతర సందర్భంగా ఆలయానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు, గ్రామ ఆడపడుచులు భారీగా తరలివచ్చారు. జాతర మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. గ్రామమంతా పండుగ వాతావరణంలో మునిగిపోయి పోలేరమ్మ అమ్మవారి నామస్మరణలతో మారుమోగింది.

# సూర్యకుమార్‌కి అక్షయ ఆర్థిక సహాయం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆత్రేయపురం మండలం ఆత్రేయపురం గ్రామానికి చెందిన కాకిలేటి సూర్య కుమార్ కి లివర్ డ్యామేజ్ అయ్యి లివర్ ఇన్ఫెక్షన్ అయింది. ప్రస్తుతం రాజమండ్రి జిఎస్ఎల్ హాస్పటల్లో ఐసియులో ఉన్నారు. 5 లక్షల వరకు ఖర్చవుతాదని వైద్యులు తెలిపారు. వీరి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థని సహాయం కోరగా సంస్థ నుంచి 10000 రూపాయలు సంస్థ సభ్యులు కే పావని 1000 రూపాయలు మొత్తం 11000 రూపాయలు సూర్య కుమార్ పెద్దమ్మకి సంస్థ సభ్యులు చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. దీనికి సహకరించిన సభ్యులందరికీ ధన్యవాదములు తెలిపారు.

# జనార్ధనస్వామి ఆలయంలో భక్తుల సందడి



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన ఆలమూరులో నవ జనార్ధన ఆలయాల్లో ప్రముఖమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారి ఆలయానికి శనివారం వైశాఖ బహుళ అమావాస్య సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నాలుగు ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి ప్రభాకరాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. స్వామివారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

# అక్రమ రొయ్యల చెరువుల తవ్వకాలను నిలిపివేయాలి

### ఆర్.డి.ఓ, తహసీల్దార్‌కు ఏఐకేఎంఎస్, రైతుల వినతి





**వేగాయమ్మపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట గ్రామంలో తాగు, సాగు నీటిని కలుషితం చేస్తున్న అక్రమ రొయ్యల చెరువుల తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్), గ్రామ రైతుల ఆధ్వర్యంలో శనివారం రామచంద్రపురం ఆర్.డి.ఓ సరళవతికి స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహాయ కార్యదర్శి బి. సిద్ధూ, జిల్లా నాయకులు చింతా రాజారెడ్డి తదితరులు మాట్లాడుతూ.. వేగాయమ్మపేట గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా చేపల రొయ్యల చెరువులను విపరీతంగా తవ్వడం వల్ల పచ్చని వ్యవసాయ భూములు ఉప్పునీటి చెరువులుగా మారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రొయ్యల చెరువుల్లో వినియోగిస్తున్న రసాయనాలు, యాంటీబయోటిక్స్, ఉప్పు, జంతు వ్యర్థాల కారణంగా భూగర్భ జలాలు కలుషితమై ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ చెరువుల వల్ల పంట భూములు ఉప్పుబారిన పడి సారాన్ని కోల్పోతున్నాయని తాగునీరు దొరక్క ప్రజలు మంచినీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని నాయకులు పేర్కొన్నారు. కలుషిత నీటి కారణంగా డయేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, పచ్చకామెర్లు వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని పశువులు కూడా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా వ్యవసాయ భూములు రొయ్యల చెరువులుగా మారడంతో కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోయి వలస బాట పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఉన్న అక్రమ చెరువులపై చర్యలు తీసుకోకపోగా.. గ్రామంలోని కొమరిన వీర వెంకట సత్యనారాయణ (అబ్బు), మద్దిపూడి రాజు, వాసంశెట్టి గోవిందు, కొమరిన సత్యనారాయణ తదితరులు మూడు పంటలు పండే సారవంతమైన భూముల్లో కొత్తగా రొయ్యల చెరువుల తవ్వకాలు చేపడుతున్నారని నాయకులు ధ్వజమెత్తారు. అధికారులు స్పందించి ఈ అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని లేనిపక్షంలో గ్రామ రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కురుపూడి గొల్లయ్య, చొల్లంగి వెంకట రమణమూర్తి, చెల్లె వెంకటరమణ, బోడ రాజు, రవ్వ మోసే, పోతుల వెంకన్న, కురుపూడి బాబురావు, టేకుమూడి త్రిమూర్తులు, కడియాల గోవిందు, పితాని సూరిబాబులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామ రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముత్యాల సత్యవతికి నివాళులర్పించిన టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు ఆర్.ఎస్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ముత్యాల బాబ్జీ అండ్ బ్రదర్స్ మాతృమూర్తి స్వర్గీయ ముత్యాల సత్యవతి ఇటీవల మృతి చెందారు. పెద్దకర్మ కార్యక్రమం శనివారం ముత్యాల బాబ్జీ స్వగృహం నందు జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల బాబ్జీ అండ్ బ్రదర్స్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సత్యవతి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఘనంగా నివాళులు అర్పించారు.





# మండపం ఉపాధిహామీ అవినీతిని వెలికి తీసిన జనసేన..!

- మండపం ఉపాధి పనుల్లో జనసేన పార్టీపై వివక్ష
- జనసేన కూలీలకు పనులు చెప్పని వైనం...!
- పొట్టకొట్టడంలో "దేశం" పార్టీ గుత్తాధిపత్యం...!
- పనులు చెయ్యకుండానే బిల్లులకు రంగం





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం మండపంలో జగనన్న ఇళ్ల కాలనీ స్థలాల నుంచి అక్రమంగా మట్టిని తవ్వుకుపోతున్న అవినీతిని లోగడ వెలికి తీసి, దానికి అడ్డుకట్ట వేసిన స్థానిక జనసేన పార్టీ నాయకులు, పోలం బ్రదర్స్ పోలం వెంకటరత్నం, పోలం విష్ణుమూర్తి (పద్మ) మరో అవినీతిని కూడా తాజాగా వెలికి తీసారు. ఈ ఎన్.డి.ఎ. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీకి చెందిన కొందరు కూలీలకు ఉపాధి హామీ పథకంలో పనులు చెప్పకుండా వివక్ష చూపుతూ ఉన్నారనీ, వాస్తవానికి చెరువులో మట్టితీత అభివృద్ధి పనులు చేపట్ట కుండానే చేసినట్లు దస్త్రాల్లో నకిలీ మస్తర్లు వేసి, వారి పేరున వేతన చెల్లింపులకు రంగం సిద్ధం చేసిన అవినీతిని ఉపాధి కూలీలు, మీడియా ప్రతినిధుల సాక్షిగా శనివారం వెలికి తీసారు. శంఖవరం మీడియా బృందం పరిశీలనలో వెలుగు చూసిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఉపాధి హామీ పథకంలో పనిచేయడానికి అన్ని అర్హతలూ ఉన్న గ్రామంలోని అన్ని సామాజిక వర్గాలు, పార్టీలు, మతాలకు చెందిన వేతనదారులకు సంవత్సరంలో ఒక్కో కుటుంబానికి (ఎంత మంది సభ్యులు ఉంటే అంత మందికీ కలిపి) గరిష్టంగా 100 రోజుల పాటు పని కల్పించి, వేతనాలను ఇవ్వాలి. అయితే దీనికి విరుద్ధంగా జనసేన పార్టీకి చెందిన కొంత మందికి ఈకెవైసి పూర్తి కాలేదు, ఆధార్ సీడింగ్ కాలేదు, ఐరిస్ (కంటి ముద్రలు) తీసుకోడం లేదు, కంప్యూటర్ మహాశయుడు ఒప్పుకోడం లేదు... వంటి వివిధ కుంటి సాకులతో పనులను చెప్పడం లేదు. వాస్తవానికి కొందరికి ఐరిస్ తీసుకోవడం లేదు. మరి కొందరికి కంప్యూటర్ సాంకేతిక సమస్యల వల్ల పనులు మంజూరు కావడం లేదు. ఇది గ్రామంలోని నూటికి నూరు శాతం మంది కూలీలకు సంభవిస్తున్న ఇబ్బంది మాత్రం కాదు. ఇది కేవలం కట్టకట్టి జనసేన కూలీలకు మాత్రమే పార్టీ పక్షపాతం, ఉపాధి హామీ పథకం క్షేత్ర స్థాయి సిబ్బంది వివక్షతో ఎదురవుతున్న ఉద్దేశ్య పూర్వకమైన కృత్రిమ సమస్య. ఇలా కూలి పనులను చెప్పక పోవడం వల్ల నష్టపోతున్న బాదితుల్లో మానుకొండ మరియమ్మ, దాసరి దుర్గాభవాని, ఇనకోటి మరియమ్మ, ముఖే మణి, తిరగటి సీతారత్నం, తిరగటి నాగమణి, నాగూరి దేవుడమ్మ, ముక్కుడుపల్లి నాగరత్నం, మరికొంత మంది పురుషులు ఏకమై స్థానిక కనకదుర్గ గుడి ప్రాంగణంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ఉపాధి హామీ పథకం ఏపిఓ. ఎన్.వి.వివిఎస్. శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ (టిఏ) వింజమళ్ళ సతీష్ లను మీడియా బృందం సాక్షిగా నిలదీశారు. మాకు మూడు వారాలుగా కూలి పనులను చెప్పడం లేదు. ఐరిస్ పడ్డం లేదు. మీకు పని మంజూరు కాలేదు అంటున్నారు. గ్రామంలో రైత్వారీ వ్యవసాయ కూలి పనులు లేవు. మరి మేం ఎలా బ్రతకాలీ. మేం అందరం ఓట్లేస్తేనే కదా ప్రభుత్వం నెగ్గిందీ అని వారి ఆవేదనను వ్యక్తం చేశారు. దీంతో దిగొచ్చిన ఏపిఓ.టిఏలు ప్రతిస్పందిస్తూ... మీరంతా వచ్చే సోమవారం నుంచి పనుల్లోకి రండి అని సర్ది చెప్పారు. కూలీల పొట్టకొట్టడంలో "దేశం" పార్టీ గుత్తాధిపత్యం కొనసాగుతున్నట్టు వెల్లడైంది. ఈ అవినీతి భాగోతం ఇలా ఉంటే... ఏకంగా ప్రభుత్వ నిధులను అక్రమంగా కాజేసే ఇంకొక అవినీతి కూడా ఇదే సందర్భంలో బట్ట బయలు అయ్యింది. మండపంలో సోమవారం ఏప్రిల్ 27 నుంచి ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఊర చెరువు (వర్క్ ఐడి 61455), రాజన్నదొర చెరువు (వర్క్ ఐడి 62822), కట్టు గట్టు చెరువు (వర్క్ ఐడి 61490) ల్లో ప్రస్తుతం ఉపాధి హామీ పథకం పనులను చేస్తున్నట్టు అంతర్జాల దస్త్రాలు వెల్లడిస్తున్నాయి. అయితే వాస్తవానికి రాజన్నదొర, కట్టు గట్టు చెరువుల్లో మాత్రమే ఎంతో కొంత పనులు జరుగు తున్నాయి. కానీ ఊర చెరువులో మాత్రం అసలు పనులు ప్రారంభమే కాలేదు. ఈ చెరువులో గతంలో ఎవరో కొంత మట్టిని ట్రాక్టర్ తో తరలించుకున్న ఆనవాళ్ళు మాత్రమే కనిపిస్తున్నాయి. నిజం ఇదైతే... ఈ ఊర చెరువులో మొదటి వారంగా ఈ మే నెలలో సోమవారం 4 తేదీ నుంచి పనులను చేసినట్లు నకిలీ కూలీల పేరున మస్తర్లు వేసి దారినపోయే దానయ్యల ఛాయా చిత్రాలను అంతర్జాలంలో నమోదు చేసారు. ఈ వారానికి వీరికి చెల్లింపులు చేయాల్సిన కూలి సొమ్ముల మొత్తాలను నమోదుచేసి వేతనాల విడుదలకు ప్రతిపాదనలు చేసారు. అంతే కాకుండా రెండో వారంలో కూడా పనులు చేయక పోయినా సోమవారం 11 తేదీ నుంచి శనివారం వరకూ కూడా నకిలీ మస్తర్లను నమోదు చేశారు. సరిగ్గా ఇక్కడే ఏ జనసేన పార్టీ కూలీలకు మూడు వారాలుగా పనులు చెప్పకుండా పొట్టకొట్టారో అదే కూలీలకు పోలం బ్రదర్స్ పుణ్యమాని ఉపాధి హామీ పథకం సిబ్బంది అడ్డంగా దొరికి పోయారు. మాకేమో పనులు చెప్పడం లేదు. పని మంజూరైన ఊర చెరువులో పనులు చేయకుండానే చేసినట్టు నమోదు చేస్తున్నారు. ఏమిటీ మీ అధికారులు చేస్తున్న నిర్వాకం అంటూ కూలీలు ఉపాధి హామీ పథకం ఏపిఓ. ఎన్.వి.వివిఎస్. శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ (టిఏ) వింజమళ్ళ సతీష్ లను పెద్ద పెట్టున నిలదీశారు. వీరు పొంతన లేని సమాధానాలు చెప్పి బ్రతుకు జీవుడా అంటూ ఎలాగోలా అక్కడ నుంచి బయట పడ్డారు. ఐతే ఈ మొత్తం వ్యవహారంపై ఉపాధి హామీ పథకం ప్రధాన అధికారి, ఎంపీడీవో యు.నాగేంద్రకు శంఖవరంలోని మండల పరిషత్తు కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలపోలం బ్రదర్స్ రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వారం పదిరోజుల్లో విచారించి తగు చర్యలు తీసుకుంటామని ఆయన ఫిర్యాదీలకు హామీ ఇచ్చారు.

## శని జయంతి సందర్భంగా మందేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రముఖులు





**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** శని జయంతి మరియు శని అమావాస్య సందర్భంగా పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప కొత్తపేట సబ్ కోర్ట్ సీనియర్ సివిల్ జడ్జ్ కుమారి ఎ.సాయి కుమారి, కోర్ట్ మూవీ హీరోయిన్ శ్రీదేవి, ముంబై హై కోర్ట్ ఫార్మర్ జడ్జ్ సునీల్ బి.శుక్రే శ్రీ స్వామి వారికి తైలాభిషేకములు నిర్వహించి, దర్శించియున్నారు. వీరికి దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికియున్నారు. శని జయంతి మరియు శని అమావాస్య సందర్భంగా భక్తులు వేలాది మంది శ్రీ స్వామి వారికి తైలాభిషేకముల నిమిత్తం విచ్చేసియున్నారు. ఈ శని జయంతి పర్వదినం దేవస్థానం నందు ప్రప్రథమంగా నిర్వహించుట జరిగినది. దేవస్థానం నందు వెనుక భాగంలో అనగా య.1-07 సెంట్లు స్థలంలో రూ.3-00 కోట్ల రూపాయలతో తైలాభిషేక మండపం మరియు రూ.1-20 కోట్ల రూపాయలతో అన్నదాన భవనము నిర్మించచన్నందున ఈ రోజు భక్తులు తైలాభిషేకలములు జరిపించుటకు దేవాలయ ప్రాంగణం తప్ప స్థలం లేనందున భక్తులందరూ ఆలయంలోనే తైలాభిషేకములు నిర్వహించియున్నారు. అందువలన భక్తులు కొంత వరకు ఇబ్బంది పడియున్నప్పటికినీ వాటిని ధర్మకర్తల మండలి సభ్యులు, పోలీసు వారి సహకారంతో అధిగమించుట జరిగినది. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో అన్నప్రసాదం, మంచి నీటి సదుపాయం, మందపల్లి పెద్ద బ్రిడ్జ్ మరియు ఏనుగులమహాల్ చిన్న బ్రిడ్జ్ వద్ద మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసియున్నాము అని దారపురెడ్డి సురేష్ బాబు, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

## పని ప్రదేశాల్లో ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు

**మంత్రి కందుల దుర్గేష్**




**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ పరిధిలోని కొవ్వూరు బ్రిడ్జి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉపాధి కూలీల మరణ వార్త విని తీవ్ర కలత చెందినట్లు పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితులకు తక్షణ సహాయక చర్యలు అందించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు. క్షతగాత్రులకు కాకినాడ జీజీహెచ్‌లో మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన శ్రామికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పని ప్రదేశాల్లో ప్రమాదాల నివారణకు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జాతీయ రహదారులు, బైపాస్ రోడ్ల వెంబడి ఉపాధి పనులు జరిగే చోట వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో కూలీల భద్రత కోసం హెచ్చరిక బోర్డులు తప్పనిసరిగా ఉంచాలన్నారు.

క్రైస్తవులు ఆధ్యాత్మికతతో పాటు

## సమాజ సేవలోనూ ముందుండాలి

**అనాధలు, అభాగ్యులకు సహాయం చేయడమే నిజమైన దైవసేవ**

**ముఖ్య వక్త రెవ. ఒనేసిము**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని ఊబ లంక గ్రామంలో రెవ. శేఖర్ బాబు ఆధ్వర్యంలో సంఘ కాపరులు, సువార్తికుల సదస్సు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు హైదరాబాద్‌కు చెందిన రెవ. ఒనేసిము ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులు ఆధ్యాత్మికతతో పాటు సమాజ సేవకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే మనసును పెంపొందించుకోవాలని అన్నారు. దైవసేవకులు ప్రజల సమస్యలను అర్థం చేసుకుంటూ సేవా దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో ఆధ్యాత్మిక బోధనలతో పాటు మానవతా విలువలు, సేవా కార్యక్రమాలు కూడా అత్యంత అవసరమని ఒనేసిము పేర్కొన్నారు. పేదలు, నిరుపేదలు, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన దైవసేవ అని వివరించారు. ఈ సదస్సులో రెవ. చిన్నబాబు, రెవ. సుందర విజయం, రెవ. మధుబాబు, రెవ. జాన్ బాబు, కొత్తపేట నియోజకవర్గానికి చెందిన దైవసేవకులు, స్థానిక విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ మెడికవర్ హాస్పిటల్స్ వైద్యుల ఆధ్వర్యంలో

## మెదడులో అరుదైన రక్తనాళాల చికిత్స విజయవంతం



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ న్యూరో సర్జన్స్ డాక్టర్ చందు లింగోలు, కృష్ణ హస్కర్, శ్రావణ్ కాకినాడ సెంటర్ మెడికవర్ హెడ్ ఎన్.అంజిబాబు ఈ నలుగురు మీడియా సమావేశంలో మాట్లాడుతూ మెదడులో రక్తనాళం బలహీనపడి ఉబ్బిన పరిస్థితిని "బ్రెయిన్ అన్యూరిజం" అని అంటారని ఇది పగిలితే ప్రాణాపాయం కలిగించే అవకాశం ఉంటుంది. ఇటీవల తీవ్రమైన తలనొప్పి, వాంతులు మరియు చూపు మసకబారడం వంటి లక్షణాలతో మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడ ఆసుపత్రికి రావడం జరిగింది అని వచ్చిన ఆ రోగికి తగిన పరీక్షలు నిర్వహించి, ఇతర న్యూరో మరియు ఇంటర్వెన్షనల్ రేడియాలజీ వైద్య బృందంతో కలిసి అత్యాధునిక "కోయిలింగ్" మరియు "ఫ్లో డైవర్షన్" విధానాల ద్వారా శస్త్ర చికిత్స అందించాలని వైద్యులు నిర్ణయించారు.స్కానింగ్ పరీక్షలలో రోగి మెదడులోని రక్తనాళంలో ప్రమాదకరమైన అన్యూరిజం ఉన్నట్లు గుర్తించామని, సంప్రదాయ ఓపెన్ సర్జరీ అవసరం లేకుండా, తొడ భాగంలోని రక్తనాళం ద్వారా సూక్ష్మ పరికరాలను ప్రవేశపెట్టి కోయిలింగ్ మరియు ఫ్లో డైవర్టర్ స్టెంట్ సహాయంతో రక్తప్రసరణను నియంత్రించి అన్యూరిజంను సురక్షితంగా మూసివేశామని తెలిపారు. న్యూరో సంబంధిత వ్యాధులు ప్రస్తుతం అన్ని వయసుల వారిలో పెరుగుతున్నాయని, సమయానికి సరైన నిర్ధారణ మరియు చికిత్స అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. మెడికవర్ హాస్పిటల్స్‌లో అత్యాధునిక సాంకేతిక పరికరాలు,24 గంటల అత్యవసర సేవలు, అనుభవజ్ఞులైన న్యూరో వైద్యులు మరియు ప్రత్యేక శస్త్రచికిత్స నిపుణుల బృందంతో క్లిష్టమైన బ్రెయిన్ మరియు నర్వస్ సిస్టమ్ సమస్యలకు సమర్థవంతమైన చికిత్సలు అందిస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమములో డాక్టర్ అజయ్ రాకేష్ వర్మ, డిఎంఎస్ డాక్టర్ ప్రసాద్, ఏఎంఎస్ రత్న మౌనిక మరియు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మండపేట వార్డుల పునర్విభజనకు

## ముసాయిదా పబ్లిక్ నోటీసు విడుదల

**30 నుండి 36 వార్డులుగా విస్తరణ**

**అభ్యంతరాలను లిఖితపూర్వకంగా సమర్పించండి : కమిషనర్ రంగారావు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మున్సిపాలిటీ ప్రస్తుతం 30 వార్డులతో ఉన్న మున్సిపాలిటీని 36 వార్డులుగా పునర్విభజించేందుకు ముసాయిదా ప్రతిపాదనలను పురపాలక సంఘం విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎమ్.ఎస్. నెం.64 మేరకు, కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల ప్రకారం ఈ ప్రక్రియ చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. 2011 జనాభా గణాంకాలు, 01-01-2026 నాటికి ప్రచురితమైన ఓటర్ల జాబితాలను ఆధారంగా తీసుకుని వార్డుల హద్దులను నిర్ణయిస్తూ ముసాయిదా రూపొందించినట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదనలను ప్రజల పరిశీలన కోసం మున్సిపల్ కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రదర్శించినట్లు తెలిపారు. వార్డుల పునర్విభజనపై ప్రజలకు ఏమైనా సూచనలు లేదా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని కమిషనర్ కోరారు.

శని జయంతి, శని అమావాస్య సందర్భంగా

## శ్రీ స్వామి వారికి తైలాభిషేకములు, హోమములు

**పోటెత్తిన భక్త జన సందోహం**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శని జయంతి మరియు శని అమావాస్య సందర్భంగా శ్రీ స్వామి వారికి తైలాభిషేకములు మరియు హోమములు ఇతర పూజల ద్వారా ఆదాయ వివరములు ముఖమండపం ఏకాదశ రుద్ర తైలాభిషేకం మహాన్యాస పూర్వక ప్రేమాభిషేకం తైలం సమర్పించి దర్శనం తిలదానం స్వయం హోమం కేశఖండన స్వయం జపం పిఎస్వో (ఫోన్ పే) ద్వారా మొత్తం రూ.9,24,240/- పరోక్ష పూజలు ద్వారా రూ.7,27,000 /-అన్నప్రసాదం విరాళాలు రూ.72,379/- మొత్తం రూ.17,23,619/- ఆదాయం వచ్చినదని దారపురెడ్డి సురేష్ బాబు సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

కొవ్వూరు బైపాస్ రోడ్డు ప్రమాద బాధితులకు

## ఎస్ఏఎఫ్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆర్థిక సహాయం



**కాకినాడ రూరల్, కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు సమీప బైపాస్ రోడ్డులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళా ఉపాధి శ్రామికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని వారి కుటుంబాలకు శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ మరియు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అండగా నిలుస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి ఎస్ఏఎఫ్ వ్యవస్థాపకులు వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి యాభై వేల రూపాయల చొప్పున మొత్తం రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇందులో ముగ్గురు మహిళల కుటుంబాలకు ఎస్ఏఎఫ్ ద్వారా మరియు మరో మహిళ కుటుంబానికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా ఈ సహాయం అందుతుందని తెలిపారు. మంత్రి సుభాష్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం ఎస్ఏఎఫ్ నాయకులు చొల్లంగి వేణుగోపాల్ మరియు గుత్తుల శ్రీనివాస్ అలాగే కడలి శివ మరియు టేకుమూడి శ్రీనివాస్ వారితో పాటు కొండా వినాయక్ మరియు గీసాల శ్రీనివాస్ ఇంకా వాసంశెట్టి అంజిబాబు మరియు అనసూరి సతీష్ తదితరులు చీడిగ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి సుభాష్ ప్రస్తుతం అందుబాటులో లేనందున ఆయన సూచనల మేరకు తాము వచ్చినట్లు తెలియజేసి బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. పొట్టకూటి కోసం ఉపాధి పనులకు వెళ్లిన నిరుపేద మహిళలు లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకమని ఈ సందర్భంగా ఎస్ఏఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు ఉపాధి శ్రామికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి సుభాష్ ఇప్పటికే వైద్యులను ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా కూడా అన్ని విధాల సహాయం అందేలా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేకంగా కృషి చేస్తారని హామీ ఇస్తూ కష్టకాలంలో ఎస్ఏఎఫ్ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

# ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత

**'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**
**స్టీల్ గ్లాసు, మట్టి వాటర్ బాటిల్స్ కు ప్రాధాన్యతనివ్వాలి : కమిషనర్ రాహుల్ మీనా**
**ప్లాస్టిక్ భూతాన్ని తరిమేస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజారోగ్యంపై ప్రభావం చూపే ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం వీఎల్ పురంలో జిల్లా స్థాయి 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాహుల్ మీనా, స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర సాధనపై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ప్రసంగిస్తూ.. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమంగా భావించకుండా, మన ఆరోగ్యానికి ఉద్దేశించబడిన కార్యక్రమంగా భావించాలన్నారు. గతంలో గుడఢ సంచులు, జ్యూట్ బ్యాగులు వినియోగించే వారని, కాలక్రమేణ ప్లాస్టిక్ వినియోగం పెరిగి ఆరోగ్యానికి చేటు తెచ్చుకుంటున్నామన్నారు. ప్లాస్టిక్ వల్ల నేల, నీరు, గాలి కాలుష్యం పెరిగి పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ప్లాస్టిక్‌లోని ప్రమాదకర రసాయనాలు ఆహారంలోకి చేరడం లేదా మైక్రోప్లాస్టిక్స్ శరీరంలోకి ప్రవేశించడం వల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదముందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. అలాగే పరిశుభ్రత మన ఇంటి వరకే పరిమితం కాకూడదని, అందరి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు.

కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం ఒక ప్రత్యేక థీమ్ ఆధారిత కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, ఈనెల 'ప్లాస్టిక్ ఫ్రీ స్టేట్' థీమ్ తో కార్యక్రమాన్ని నిర్వహించుకోవటం జరిగిందన్నారు. రాజమహేంద్రవరంలో చూసుకుంటే రోజూ టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలో కలుస్తుండటంతో.. గోదావరి నది తీవ్రమైన పర్యావరణ ముప్పును ఎదుర్కొంటోందన్నారు. నది తీర ప్రాంతాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, పాలిథిన్ కవర్లు నీటిని కలుషితం చేయడమే కాకుండా, నదీ జల వ్యవస్థను దెబ్బతీస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. అలాగే నగర పౌరులలో ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలపై చైతన్యం తీసుకువచ్చేందుకు నగరపాలక సంస్థ అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాలలోనూ ఇప్పటికే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందని.. ప్రజలు కూడా తమ ఇళ్లల్లో స్టీల్ గ్లాసు, మట్టి వాటర్ బాటిల్స్ లకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పర్యావరణానికి పెనుముప్పుగా తయారైన ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడదామని పిలుపు నిచ్చారు. ఇటీవల నగరంలోని ఒక కల్వర్ట్ వద్ద పూడికతీయడంతో 3-4 గంటల వ్యవధిలోనే 10 లారీల వ్యర్థాలు వచ్చాయని, అందులో అధిక భాగం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉన్నట్లు పేర్కొన్నారు. కనుక భవిష్యత్తుతరాల్ని దృష్టిలో ఉంచుకొని, అందరూ కలిసికట్టుగా ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా చిన్నారులకు బాల్యం నుంచే ప్లాస్టిక్‌ను దూరం చేయడం ద్వారా వారికి ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించవచ్చన్నారు. అనంతరం 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' పోస్టర్ ను ఆవిష్కరించారు. ప్లాస్టిక్ రహిత సంచులను ప్రోత్సహిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ వి.వినూత్న, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# మూగజీవాల బాధలు పాలకులకు, అధికారులకు పట్టవా?

**మాజీ పార్లమెంట్ సభ్యుడు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మనుషులే తట్టుకోలేని ఉష్ణోగ్రతల నేపథ్యంలో మూగజీవాల బాధలు ప్రస్తుత పాలకులకు, అధికారులకు పట్టకపోవడం విచారకరమని మాజీ పార్లమెంట్ సభ్యుడు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ మండిపడ్డారు. స్థానిక పుష్కరాల రేవు వద్ద మూగజీవాలు,పక్షుల దాహార్తిని తీర్చేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నీటి కుండీలను ఏర్పాటు చేశారు. ఆవులు, దూడల కోసం స్వయంగా ఆయనే తవుడు కలిపి వాటికి పెట్టారు. దూడలకు అరటి పళ్ళు తినిపించారు. ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ ఎండవేడికి మనుషులే విలవిలలాడిపోతున్నారని ఇక మూగజీవాలు ఎలా తట్టుకుంటాయని ఆయన ప్రశ్నించారు. దాతృత్వానికి మారుపేరైన రాజమహేంద్రవరంలో పరిస్థితి ఇలా ఎప్పుడూ లేదని,దానికి పాలకులే కారణమని ఆయన అన్నారు. త్వరలో గోదావరి పుష్కరాలు రాబోతున్నాయని ఈ చిన్న పనులే చేయలేని కూటమి ప్రభుత్వం పుష్కరాలను ఏ విధంగా నిర్వహిస్తుందని ఆయన ప్రశ్నించారు. కనీసం రాజమండ్రి కార్పొరేషన్ అధికారులు నీటి కుండీలను ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కుండీలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. వీధి కుక్కలకు సంబంధించి ఏబీసీ ఆపరేషన్ల విషయంలో పెద్ద ఎత్తున స్కాం జరుగుతుందని,రోజు యాభై కుక్కలకు ఆపరేషన్లు చేసామని బిల్లులు వసూలు చేయడం తప్ప జరుగుతుందో లేదో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కుక్కలకు ఐసోలేషన్ చేస్తున్నారో లేదో కూడా తెలియదని,దీనిపై పూర్తిస్థాయి పర్యవేక్షణ ఉండాలని అయన అన్నారు.మానవత దృక్పథంగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో నీటి కుండీలను ఏర్పాటు చేసి మూగజీవాలు పక్షుల దాహార్తిని తీరుస్తామన్నారు. ఇదే పుష్కర ఘాట్ ప్రాంతంలో తన హయాంలో ఏర్పాటు చేసిన ఐ లవ్ రాజమహేంద్రవరం లోగో వద్ద పరిస్థితి అధ్వానంగా ఉందని నీరు నిల్వ ఉండి దుర్వాసన కొడుతుందన్నారు. సెంట్రల్ జైలు రోడ్డు, పుష్కర ప్లాజా, కంబాలచెరువు పార్క్, పుష్కర్ ప్లాజా ఇవన్నీ నిర్వీర్యం చేస్తున్నారని,వై జంక్షన్ వద్ద ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసామని,ఎక్కడ చూసినా వాటర్ ఫౌంటెన్లు మురుగునీటితో ఉండటం ఈ పాలకుల నిర్లక్షానికి నిదర్శనమని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ పై అధిక ధరలు వసూలు చేస్తున్నారని భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు.పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడులో కూడా ఏపీ కంటే తక్కువ ధరలే ఉన్నాయని ఏపీలో ఎందుకు ఎక్కువ వసూళ్లు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.వైసిపి హయాంలో పెట్రోల్ ధర పెరిగినప్పుడు పెట్రోల్ బంకులు వద్దకు వెళ్లి నిరసన చేసిన చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ఇప్పుడు దీనికి ఏమి సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. కేంద్రంలో భాగమైన కూటమి ప్రభుత్వం తక్షణమే పెట్రోల్ ధరలను తగ్గించాలని భరత్ రామ్ డిమాండ్ చేశారు.మరోవైపు ఆక్వా రైతులకు పిడుగు లాంటి వార్త వచ్చిందన్నారు. ఆక్వా ఫుడ్ పై టన్నుకి కి పదివేల రూపాయలు పెంచడం దారుణం అన్నారు. ఆక్వా ఫుడ్ తయారుచేసే కంపెనీలు ఆంధ్రప్రదేశ్లో ఆరు ఉంటాయని అవన్నీ తెలుగుదేశం పార్టీకి అనుకూలమైన సామాజిక వర్గీయులదేనని ఆయన అన్నారు.కూటమి ప్రభుత్వం వారికి లబ్ది చేకూర్చేలా వ్యవహరించడం సరికాదన్నారు దేశంలో కెల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 40% సీ ఫుడ్ ఇతర దేశాలకు ఎగుమతి అవుతుందని దానివల్ల ఆర్థికంగా ఆంధ్రప్రదేశ్ లాభపడుతుందన్నారు అయితే ఆక్వా ఫుడ్ పై టన్నుకి 10,000 పెంచడం ద్వారా ఇక సాగు చేసే అవకాశాలు తగ్గి ఎగుమతులు కూడా తగ్గి పోతాయని ఇది రాష్ట్ర అభివృద్ధికి తీవ్ర విఘాతం కలుగుతుందని భరత్ అన్నారు. పుష్కరాలు సమీపిస్తున్న కొద్ది పనులు ప్రారంభమే కాలేదని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూస్తే పుష్కరాలు ఏవిధంగా జరుగుతాయో అన్న ఆందోళన నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కాంగ్రెస్ ఆగ్రహం

**కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి నల్లమిల్లికి లేదు - మోదీ హామీలపై కాంగ్రెస్ నేతల విమర్శలు**
**నల్లమిల్లి వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ - టీకే విశ్వేశ్వరరెడ్డి, బాలేపల్లి మురళీధర్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోదీ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కాంగ్రెస్ పార్లమెంట్ కోఆర్డినేటర్ టీకే విశ్వేశ్వర రెడ్డి విమర్శిం చారు. విదేశీ బ్యాంకుల్లోని నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామని 2014లో ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని ప్రశ్నించారు. శనివారం స్థానిక మున్సిపల్ కాలనీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మోదీపై విమర్శలు చేసిన మాజీ మంత్రి పేర్ని నాని, ఎఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. నల్లమిల్లి ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో ఆయనకే స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయుడు, దగ్గుబాటి పురంధరేశ్వరి వంటి పలువురు నేతలు కాంగ్రెస్‌లో పదవులు అనుభవించి తరువాత ఇతర పార్టీలకు వెళ్లారని గుర్తుచేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. పెద్ద మొత్తంలో రుణాలు తీసుకుని విదేశాలకు పారిపోయిన వారికి లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సింధియారాణి, డాక్టర్ రాజశేఖర్, మేడవరపు భద్రం దొర, బర్రే సుబ్రహ్మణ్యం, చిన్నం మురళీకృష్ణ, కిశోర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలక్ష్మీ కుబేర సుదర్శన హోమంతో ఆర్థిక స్థిరత్వం


**–దేశంలోనే తొలిసారిగా వాహనంతో కూడుకున్న మహాలక్ష్మి హోమం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పంచ పర్వములలో మహా పర్వమైనటువంటి అమావాస్య రోజున శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం ప్రాంగణంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద శనివారం దర్శ (అమావాస్య) ప్రయుక్త శ్రీ లక్ష్మీ కుబేర సుదర్శన హోమం జరిగింది. భారతదేశంలోని మొట్టమొదటిసారిగా వాహనంతో కూడుకున్న మహాలక్ష్మి హోమం జరగడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బ్రహ్మశ్రీ బోడెం నాగ సత్య రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో పండిత పురోహితుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. దర్శ (అమావాస్య) రోజున చేసే శ్రీ లక్ష్మీ కుబేర సుదర్శన హోమం చాలా పవిత్రమైనదని, ఈ హోమం వలన సంపద, ఆర్థిక స్థిరత్వం, రక్షణ కోసం చేసే ఒక శక్తివంతమైన పూజా విధానమని,దీని ద్వారా లక్ష్మీదేవి, కుబేరుడు, సుదర్శన చక్రం (విష్ణుమూర్తి) యొక్క అనుగ్రహం కలుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, నగర ప్రముఖులు కూర్మదాసు ప్రభాకర్, గారపాటి సూర్యనారాయణ, పెద్దిరెడ్ల శ్రీనివాస్,నరసింహారాజు,ఉమా మార్కండేయ లలితా మండలి సభ్యులు పాల్గొన్నారు.పూజ కార్యక్రమాల నిమిత్తం ఆసక్తి కలవారు బోడెం నాగ సత్య రవికుమార్ శర్మ 9908798988 నెంబర్ కు సంప్రదించాలన్నారు.

**వడ్రంగి కార్మికుల జిల్లా ఉపాధ్యక్షులుగా**

# కోటిపల్లి కృష్ణ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట శ్రీ కామాక్షి ఏకాంబేశ్వర కమ్యూనిటీ హాల్ నందు శనివారం వడ్రంగి కార్మికుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా యూనియన్ సమావేశం ను ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి తూర్పుగోదావరి జిల్లా వడ్రంగి కార్మికుల సంఘం నాయకులు దేవగుప్త శ్రీనివాసు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండపేటను తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయడం వల్ల వడ్రంగి పనివార్ల నూతన జిల్లా ఉపాధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులను ఎన్నిక చేయడం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షులుగా కోటిపల్లి కృష్ణమాచార్యులు (కృష్ణ)ను, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రామోజు కృష్ణ, కమిటీ సభ్యులుగా ఓడారి అయ్యప్పను జిల్లా నాయకులు ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తూర్పుగోదావరి జిల్లా వడ్రంగి కార్మికుల సంఘం నాయకులు దేవగుప్త శ్రీనివాసు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు దేవగుప్త శ్రీనివాసు మాట్లాడుతూ చేతి వృత్తుల్లో చెక్కతో ఇళ్లు, గృహపకరణాలు తదితర వస్తువులను తయారుచేసే నైపుణ్యం కలిగిన హస్తకళాకారులు వడ్రంగి కార్మికులని సాంప్రదాయకంగా ఈ వృత్తిని విశ్వబ్రాహ్మణులు కులవృత్తిగా చేస్తారని కానీ ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన వారు కూడా ఈ వడ్రంగి పని చేయడం వల్ల తమ కుటుంబాలు రోడ్లు పడుతున్నాయని వడ్రంగి పని చేసే వారు కనుమరుగవుతున్నారని ఈ మధ్యకాలంలో పివిసి గ్రానైట్ వంటి రెడీమేడ్ ఫర్నిచర్లు రావడం వల్ల ఒక కులవృత్తిగా చిన్నప్పటినుండి నేర్చుకుని నేటి ఈ రంగంలో పనులు లేక వడ్రంగి పనివాళ్ళు తీవ్రమైన పేదరికం అనుభవిస్తున్నారని ఇళ్ల నిర్మాణంలో, ముఖ్యంగా ప్లైవుడ్ చెక్క పనులలో వీరి పాత్ర అత్యంత కీలకం అని అటువంటి వారికి ఇతర రాష్ట్రాల నుండి వచ్చే ఫర్నిచర్ లు వర్కర్స్ వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తూర్పు గోదావరి జిల్లా కార్పెంటర్ సంఘం నాయకులు దేవగుప్త శ్రీనివాసు ఆవేదన వ్యక్తం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా మండపేట పట్టణం నుండి నూతనంగా ఏర్పడిన సభ్యులకు రానున్న రోజుల్లో వడ్రంగి పనిచేసే కార్మికులకు ఎటువంటి సమస్య వచ్చిన వారి కుటుంబానికి అండగా నిలబడి వారి సమస్యను పరిష్కరించి యూనియన్ ని బలోపేతం చేయాలని కోరారు. నూతనంగా ఏర్పడిన కార్యవర్గానికి జిల్లా నాయకులు ప్రమాణ స్వీకారం చేయించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ కామాక్షి వడ్రంగి యువజన సంఘం అధ్యక్షులు గోడి సుబ్రహ్మణ్యం, వేముల శ్రీరామ్ మూర్తి, విన్నకోట రాధాకృష్ణ, వీరమల్ల శ్రీనివాసు, తాళబత్తుల ప్రభాకర్ రావు, గొల్తి శ్రీను, కోటిపల్లి రాంబాబు మాస్టారు, కాగితపు వీరబ్రహ్మం, తామరపల్లి సూరిబాబు, యిలి చిన్ని, పొన్నాడ సత్తిబాబు, దార్ల నాగు, అరిపిరలా నానాజీ, సింహాద్రి వీరబాబు, కొమ్ముజు బుల్లి, శ్రీ కామాక్షి వడ్రంగి యువజన సంఘం పట్టణ కార్పెంటర్స్ సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

# ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజలకు అవగాహన

## ఎమ్మార్వో సుగుణ




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛ్ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని నివారించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరుకొండ తాసిల్దార్ డి.సుగుణ అన్నారు. శనివారం కోరుకొండలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్నికి బదులుగా క్లాత్ సంచులు, నార సంచులను ఉపయోగించాలన్నారు.ఈ సందర్భంగా తాసిల్దార్ సుగుణ మాట్లాడుతూ వ్యాపార సంస్థల యజమానులకు, గ్రామ ప్రజలకు ప్లాస్టిక్ వాడకం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులపై అవగాహన కల్పించారు.ప్లాస్టిక్ స్థానంలో గుడ్డ, నారా సంచులు వాడతామని, పెళ్ళిళ్ళు,పంక్షన్లు కార్యక్రమంలో ప్లాస్టిక్ ప్లేట్స్, ప్లాస్టిక్ గ్లాసులు బదులు అరిటాకులు,స్టీలు గ్లాసులు వాడతారని ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి తీవ్రంగా తూట్లు పడుతున్నాయని, తద్వారా భావితరాల భవిష్యత్తు అంధకారం కానందున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరత్నం, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది, ఉపాధి హామీ శ్రామికులు తదితరులు పాల్గొన్నారు.


# మే 20న మెడికల్ షాపులు దేశావ్యాప్త బంద్

**ది ఆలమూరు తాలూకు కెమిస్ట్రీ & డ్రగిస్ట్ అసోసియేషన్ బంద్ పోస్టర్ ఆవిష్కరణ**




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ది ఆలమూరు తాలూకు కెమిస్ట్రీ & డ్రగిస్ట్ అసోసియేషన్ మండపేట ఆధ్వర్యంలో మే 20 బుధవారం నాడు మత్తు పదార్థాలు, ఆన్లైన్ మందుల విక్రయాలను వ్యతిరేకిస్తూ దేశావ్యాప్తంగా 12.40 లక్షల కెమిస్ట్రీడగ్రిస్టు చేస్తున్నా బంద్ లో పాల్గొంటున్నట్లు తెలిపారు.ఈ బంద్ కి సంబంధించిన పోస్టర్ను ప్రెసిడెంట్ బొబ్బ రామకృష్ణ, సెక్రటరీ వెలగల శ్రీనివాస్ రెడ్డి , ట్రెజరర్ బోడ్డు ప్రసాద్ తదితర కెమిస్టు శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత ఆన్లైన్ నందు మత్తు నిచ్చే డ్రగ్స్ ను, మత్తుపదార్థాలను ఎటువంటి అంక్షలు లేకుండా వాటిని విరివిగా కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు దీని వల్ల వారి బంగారు భవిష్యత్తును అంధకారం లో నెట్టుకుంటున్నారని,ఈ ఆన్లైన్ లో మందులు కొనుగోలు చేయడం వల్ల ఇక్కడ వారు ఉపాధి అవకాశాలు కోల్పోతున్నరని,ఎక్కడో ఉన్నవారికి ఇక్కడి సంపద పంపుతున్నామని మన ఊరు మన వర్తకులు అనే భావన ప్రతి ఒక్కరికి రావాలని అన్నారు. ప్రభుత్వం జీవో నెంబర్ 817, జీవో నెంబర్ 220 లను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ బంద్ ను ప్రజలందరు గమనించి సహకరించగలరని కోరారు.

# దేశచరిత్రలో సీఎం చంద్రబాబు లోకేష్‌ల నిర్ణయం : సల్మాన్ హుస్సేన్



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడును ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా సీఎం చంద్రబాబు లోకేష్‌ల వినూత్న నిర్ణయం దేశంలో అన్ని పార్టీలకు ఆదర్శమని టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహానాడు కార్యక్రమాన్ని ఈసారి వర్చువల్ విధానంలో నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం దూరదృష్టికి నిదర్శనమన్నారు. ప్రజాధనం, పార్టీ వనరుల వినియోగంలో పొదుపు పాటిస్తూ, సాంకేతికతను సమర్థంగా వినియోగించాలనే సీఎం చంద్రబాబు ఆలోచన ప్రతి కార్యకర్తకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,845 క్లస్టర్లలో స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రతి కార్యకర్త మహానాడులో భాగస్వామి అయ్యేలా చర్యలు తీసుకోవడం పార్టీ చరిత్రలో కొత్త అధ్యాయమని తెలిపారు. ఎన్టీఆర్ భవన్ కేంద్రంగా రాష్ట్ర నాయకత్వం, పొలిట్‌బ్యూరో సభ్యులు పాల్గొనే విధంగా రూపొందించిన ఈ వ్యవస్థ పార్టీని మరింత బలోపేతం చేస్తుందన్నారు. పార్టీని ఆధునీకరించడంలో టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. యువత, టెక్నాలజీ, పార్టీ వ్యవస్థలను సమన్వయం చేస్తూ మహానాడును డిజిటల్ స్థాయిలో విజయవంతం చేయడానికి లోకేష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే మహానాడు కార్యక్రమం తెలుగుదేశం పార్టీకి కొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి దిశను తెలియజేస్తుందని తెలిపారు.






ఆ సినిమాలో అస్సలు నటించను..

# రూ.12కోట్లు ఇస్తానన్నా నో చెప్పిన త్రిష..

నాలుగు పదుల వయసులోనూ చేతి నిండా సినిమాలతో కుర్ర హీరోయిన్లకు చెమటలు పట్టిస్తోంది త్రిష కృష్ణన్. దాదాపు 20 సంవత్సరాలుగా ఇండస్ట్రీలో అగ్ర కథానాయికగా చక్రం తిప్పుతున్న ఈ అమ్మడు.. అటు తమిళం, ఇటు తెలుగు ఇండస్ట్రీలలో వరుస సినిమాలతో దూసుకుపోతుంది. సినిమా ఇండస్ట్రీలో సక్సెస్ ఫుల్ హీరోయిన్ గా రాణిస్తున్నారు నటి త్రిష. నాలుగు పదుల వయసులో కుర్ర హీరోయిన్స్ కు పోటీ ఇస్తూ తన అందంతో కుర్రకారును కట్టిపడేస్తున్నారు త్రిష. రీసెంట్ గా కరుప్పు సినిమాతో హిట్ అందుకున్నారు త్రిష. సూర్య హీరోగా నటించిన ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తమిళ్ తో పాటు తెలుగులోనూ సినిమాలు చేస్తూ హిట్స్ అందుకుంటుంది త్రిష. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమాలో త్రిష హీరోయిన్ గా నటిస్తుంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే త్రిషకు ఓ భారీ ఆఫర్ వచ్చినట్టు తెలుస్తుంది. అంతే కాదు ఆ సినిమా కోసం ఏకంగా 12కోట్లు కూడా ఆఫర్ చేశారట. కానీ త్రిష మాత్రం ఆ సినిమా ఆఫర్ ను రిజెక్ట్ చేసిందని టాక్ వినిపిస్తుంది. పైగా ఆ సినిమాలో ఇద్దరు బడా హీరోలు. ఇంతకూ త్రిష ఎందుకు ఆ సినిమాను రిజెక్ట్ చేసింది. అసలు కారణం ఏంటి అనేది ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. అసలు మ్యాటర్ ఏంటంటే.. సూపర్ స్టార్ రజినీకాంత్, కమల్ హాసన్ కలిసి సినిమా చేస్తున్న విషయం తెలిసిందే.. ఈ సినిమాకు స్టార్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా నుంచి గ్లింప్స్ కూడా విడుదల చేశారు. ఈ సినిమాలో హీరోయిన్ గా త్రిషను సంప్రదించారట. అయితే ఆ ఆఫర్ కు త్రిష నో చెప్పారని తెలుస్తుంది. అంతే కాదు సినిమాకోసం ఏకంగా రూ. 12 కోట్లు రెమ్యునరేషన్ ఆఫర్ చేశారట.. అయినా కూడా త్రిష ఈ సినిమాను చేయడానికి అంగీకరించలేదని తెలుస్తుంది. ఈ భారీ ఈ సినిమాను ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్‌జెయింట్ నిర్మాణసంస్థ తెరకెక్కించడంతో త్రిష ఈ సినిమా ఆఫర్ ను రిజెక్ట్ చేసిందని ఇంగ్లీష్ మీడియా తెలిపింది.. అయితే త్రిష నో చెప్పడానికి అసలు రీజన్ ఇదేనా అని అభిమానుల్లో డౌట్స్ మొదలయ్యాయి. కాగా విజయ్ ఇటీవలే తమిళనాడు సీఎంగా పదవీబాధ్యతలు స్వీకరించారు. కాగా ఈ ఎన్నికల్లో త్రిష పేరు కాస్త గట్టిగా వినిపించిన విషయం తెలిసిందే..



చరణ్ పక్కన ఆమె చిన్నపిల్లలా అనిపించింది..

# జాన్వీ కపూర్ తీసుకున్నాం..

రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ సినిమా 'పెద్ది' పై భారీ అంచనాలు ఉన్నాయి. 'ఉప్పెన' సినిమాతో జాతీయ అవార్డు అందుకున్న దర్శకుడు బుచ్చి బాబు సనా ఈ మూవీని తెరకెక్కిస్తున్నాడు. బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ పెద్ది. ఈ సినిమా కోసం అభిమానులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఉప్పెన సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న బుచ్చిబాబు దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. తొలి సినిమా ఉప్పెన సినిమాతో బుచ్చిబాబు సంచలన విజయాన్ని అందుకున్నాడు. అదే సినిమాతో ఓవర్ నైట్ లో స్టార్ డైరెక్టర్ గా మారిపోయాడు. ఉప్పెన తర్వాత చాలా కాలం గ్యాప్ తీసుకున్న బుచ్చిబాబు పెద్ది సినిమాతో ప్రేక్షకులను అలరించడానికి రెడీ అవుతున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే ఈ సినిమాలో రామ్ చరణ్ డిఫరెంట్ లుక్ లో కనిపించనున్నాడు. ఊర మాస్ గెటప్ లో చరణ్ కనిపించనుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ సినిమాలో చరణ్ కు జోడీగా జాన్వికపూర్ హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా పెద్ది సినిమా ప్రమోషన్స్ లో భాగంగా దర్శకుడు బుచ్చిబాబు ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అలాగే ఈ సినిమాలో హీరోయిన్ గా జాన్వీ కంటే ముందే మరో భామను సంప్రదించారట. దీని గురినిక్ బుచ్చిబాబు మాట్లాడారు. నేను మొదట 'అచ్చియమ్మ' పాత్రను జాన్వీ కపూర్ చెల్లి ఖుషీ కపూర్‌కు వినిపించాను. కానీ, ఆమెను పర్సనల్‌గా చూసిన తర్వాత ఈ క్యారెక్టర్‌కు ఆమె చాలా చిన్న పిల్లలా అనిపించింది" దాంతో ఆమె అక్క జాన్వీని హీరోయిన్ గా ఎంపిక చేశా.. ఒకే ఇంట్లో ఉంటూ చెల్లిని వద్దని, అక్కకు కథ చెప్పాల్సి రావడం నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. ఒకవేళ ఖుషీ ఫీల్ అయ్యిందా అని జాన్వీని అడిగాను అని బుచ్చిబాబు తెలిపారు. మొదటి నుంచి నేను జాన్వీనే హీరోయిన్ గా ఫిక్స్ అయ్యా.. ఎవరికైనా కథ చెప్పినా కూడా నా కళ్లముందు జాన్వీనే కనిపించింది అని బుచ్చిబాబు అన్నారు. 1980ల నాటి పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ కథలో జాన్వీ 'అచ్చియమ్మ'గా డీగ్లామర్, పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనుంది. మరి ఈ సినిమా జాన్వీ ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

చెపాక్‌లో ఫేర్‌వెల్

# మ్యాచ్ ఆడనున్న ధోని..?

5ఏళ్ల క్రితమే ప్లేన్ చెప్పేశాడుగా..!




ఐపీఎల్ 2026 సీజన్ లీగ్ దశ ముగింపునకు చేరుకుంటున్న వేళ క్రికెట్ ప్రపంచంలో ఒకే ఒక్క ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. మే 18న చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగబోయే చెన్నై సూపర్ కింగ్స్ చివరి హోమ్ మ్యాచ్‌లో 'తలా' మహేంద్ర సింగ్ ధోనీ ఆడబోతున్నాడా? ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ మే 18న సోమవారం రాత్రి తమ సొంత మైదానమైన ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ సీజన్‌లో చెన్నై జట్టుకు ఇది చివరి హోమ్ మ్యాచ్ కావడంతో స్టేడియం మొత్తం పసుపు వర్ణంగా మారిపోనుంది. అయితే ఈ మ్యాచ్‌లో అందరి కళ్లు చెన్నై మాజీ సారథి ఎంఎస్ ధోనీపైనే ఉన్నాయి. ఈ సీజన్ ప్రారంభం నుంచి గాయం కారణంగా ధోనీ ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడంతో, ఈ ఆఖరి హోమ్ మ్యాచ్‌కైనా అతను తుది జట్టులోకి వస్తాడా లేదా అన్నది ఉత్కంఠగా మారింది.

**నా చివరి టీ20 చెన్నైలోనే.. పాత వ్యాఖ్యలు వైరల్..**


గతంలో 2021లో జరిగిన ఒక సిఎస్‌కె అధికారిక కార్యక్రమంలో ధోనీ మాట్లాడుతూ.. "నేను ఎప్పుడూ నా క్రికెట్‌ను ప్రణాళికాబద్ధంగానే ముగిస్తాను. భారతదేశంలో నేను ఆడిన చివరి వన్డే నా సొంత ఊరైన రాంచీలో జరిగింది. అలాగే నా చివరి టీ20 మ్యాచ్ చెన్నైలోనే జరుగుతుందని ఆశిస్తున్నాను. అది వచ్చే ఏడాది కావొచ్చు లేదా ఐదేళ్ల తర్వాత కావొచ్చు, నాకైతే తెలియదు" అంటూ వ్యాఖ్యానించాడు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ధోనీ ఆడిన ఆనాటి మాటలు నిజమయ్యే సమయం ఆసన్నమైందా అనే చర్చ నడుస్తోంది. ఒకవేళ ధోనీ రిటైర్మెంట్ ప్రకటించాలనుకుంటే, చెపాక్ మైదానంలో సన్‌రైజర్స్‌తో జరిగే ఈ మ్యాచ్ అతనికి వీడ్కోలు మ్యాచ్ అయ్యే అవకాశం ఉందంటూ విశ్లేషకులు భావిస్తున్నారు.

**గాయం ఇంకా వేధిస్తోందా?**

ఈ ఐపీఎల్ సీజన్ ప్రారంభానికి ముందు జరిగిన వార్మప్ మ్యాచ్‌లలో ధోనీ తీవ్రమైన గాయానికి గురయ్యాడు. దీంతో జట్టు ఫిజియో పర్యవేక్షణలో సుదీర్ఘ కాలం పాటు కోలుకునేందుకు ప్రయత్నించాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో కూడా ధోనీ ఆడతాడని అభిమానులు ఆశించినా, అతను బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఆ మ్యాచ్‌లో చెన్నై ఓటమి చవిచూడటంతో ప్లేఆఫ్స్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలోని సిఎస్‌కె జట్టు సమతుల్యతను దెబ్బతీయకుండా, కేవలం వీడ్కోలు కోసమే ధోనీని జట్టులోకి తీసుకుంటారా అన్నది మేనేజ్‌మెంట్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంది. మహేంద్ర సింగ్ ధోనీకి చెన్నై నగరంతో, అక్కడి అభిమానులతో ఉన్న బంధం విడదీయరానిది. ఈ నేపథ్యంలో మే 18న సన్‌రైజర్స్‌తో జరిగే పోరులో ధోనీ మైదానంలోకి అడుగుపెడితే గనక చెపాక్ స్టేడియం హోరెత్తడం ఖాయం. ఒకవేళ అతను ఫిట్‌నెస్ సాధించి బరిలోకి దిగితే, అది అభిమానులకు అతిపెద్ద పండగ లాంటి వార్త అవుతుంది.

ఆ విషయంలో బీసీసీఐకి

# ఇచ్చిపడేసిన విరాట్ కోహ్లీ..



ఐపీఎల్ 2026 సీజన్ వేళ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సంచలన వ్యాఖ్యలు చేశారు. మైదానంలోనే కాకుండా ప్రాక్టీస్ సెషన్స్, డ్రెస్సింగ్ రూమ్‌లలో ఆటగాళ్ల వ్యక్తిగత విషయాలను సైతం కెమెరాల్లో బంధించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. క్రికెటర్ల ప్రైవసీని కాపాడాలంటూ బీసీసీఐకి కోహ్లీ పంపిన ఈ డిమాండ్ నోటీస్ ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. భారతదేశంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కేవలం ఒక ఆట మాత్రమే కాదు, కోట్ల మంది అభిమానుల భావోద్వేగం. వేసవి కాలంలో రెండు నెలల పాటు సాగే ఈ క్రికెట్ పండుగను వీక్షించేందుకు అభిమానులు టీవీలకు అతుక్కుపోతుంటారు. అయితే, ఈ విపరీతమైన క్రేజ్ ఇప్పుడు ఆటగాళ్ల వ్యక్తిగత స్వేచ్ఛకు (ప్రైవసీ) పెద్ద ముప్పుగా పరిణమించింది. ఎటు చూసినా కెమెరాల నిఘా ఉండటంపై విరాట్ కోహ్లీ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఇటీవల ఆర్సీబీ నిర్వహించిన ఒక ప్రత్యేక పాడ్‌కాస్ట్‌లో కోహ్లీ మాట్లాడుతూ, మైదానంలో ఆటగాళ్ల చుట్టూ నిరంతరం కెమెరాలు ఉండటం వల్ల తాము తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నామని పేర్కొన్నాడు. ప్రాక్టీస్ సెషన్లలో గానీ, సహచర ఆటగాళ్లతో వ్యక్తిగత సంభాషణలు జరిపేటప్పుడు గానీ కనీస ప్రైవసీ కరువైందని ఆవేదన వ్యక్తం చేశాడు. సోషల్ మీడియా హవా పెరిగిన తర్వాత కంటెంట్ క్రియేషన్, ఫ్యాన్ ఎంగేజ్‌మెంట్ పేరిట క్రికెటర్ల ప్రతి కదలికను రికార్డు చేయడం సరికాదని హితవు పలికాడు.

**నెట్స్‌లో ప్రయోగాలు చేయలేకపోతున్నాం..!**

"మనం ప్రాక్టీస్ గ్రౌండ్‌లోకి అడుగు పెట్టగానే ఆరు కెమెరాలు మనల్ని వెంబడించడం అస్సలు సౌకర్యంగా ఉండదు. ఒక క్రీడాకారుడిగా ప్రశాంతమైన వాతావరణంలో నా ఆటను మెరుగుపరుచుకునే స్వేచ్ఛ నాకు ఉండాలి. నెట్స్‌లో మేము చేసే ప్రతి చిన్న పనిని రికార్డు చేసి, సోషల్ మీడియాలో దానిపై చర్చలు పెట్టడం వల్ల ఆటగాళ్లు సహజత్వాన్ని కోల్పోతున్నారు. మ్యాచ్‌లలో మా ప్రదర్శనను బట్టి మమ్మల్ని అంచనా వేయండి, అంతేకాని ప్రాక్టీస్ సెషన్లలో మేము చేసే ప్రయోగాలను విమర్శించే హక్కు ఎవరికీ లేదు" అని కోహ్లీ ఘాటుగా స్పష్టం చేశాడు. బీసీసీఐ ఈ నిరంతర కెమెరా నిఘాపై పునరాలోచించాలని, ఆటగాళ్లను ఎప్పుడు షూట్ చేయాలి, ఎప్పుడు చేయకూడదు అనే అంశాలపై స్పష్టమైన నిబంధనలు తీసుకురావాలని కోహ్లీ డిమాండ్ చేశారు. ఆటగాడి అనుమతి లేకుండా ప్రతి క్షణాన్ని రికార్డు చేయడం ఇకనైనా ఆపాలని కోరాడు.

**వివాదాలకు కేంద్రంగా మారిన ఐపీఎల్ 2026 కెమెరాలు..**

విరాట్ కోహ్లీ వ్యక్తం చేసిన ఆందోళనలు కేవలం ఊహాజనితం కావు. ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లోనే కెమెరాల అతి వల్ల ఆటగాళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న కొన్ని ఇబ్బందికర దృశ్యాలను బ్రాడ్‌కాస్టర్ కెమెరాలు లైవ్‌లో చూపించాయి. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. దీనిపై స్పందించిన బీసీసీఐ, సదరు ఆటగాడి ప్రవర్తనను తప్పుబడుతూ భారీ జరిమానా కూడా విధించింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతుండటంతోనే కోహ్లీ ఈ నిర్ణయం తీసుకున్నారు. క్రికెటర్ల ప్రైవసీని కాపాడాలనే కోహ్లీ డిమాండ్ న్యాయబద్ధమైనదే అయినప్పటికీ, బీసీసీఐకి ఇది పెద్ద తలనొప్పిగా మారనుంది. ఎందుకంటే బ్రాడ్‌కాస్టర్ల ద్వారానే బోర్డుకు వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది. కెమెరాల విజువల్స్ పై ఆంక్షలు విధిస్తే ఆదాయ వనరులపై ప్రభావం పడే అవకాశం ఉంది. మరి ఈ ప్రైవసీ వివాదంపై బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.






VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com